

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 06-10-2025 | సంపుటి - 25 | సంచిక -142 | రూ : 4 | పేజీలు: 8

## సీనియర్ సిటిజెన్ దర్శనంపై అదంతా తప్పుడు ప్రచారమే



2లో

- వయోవృద్ధుల దర్శనంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- అవాస్తవాలను నమ్మవద్దని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి
- రోజూ 1000 మందికి దర్శనం, ఆన్‌లైన్‌లో టికెట్ల విడుదల
- అలిపిరి మార్గంపైనా అసత్య వార్తల ప్రచారం
- ఘటన జరిగింది టీటీడీ పరిధిలో కాదని స్పష్టీకరణ
- తప్పుడు ప్రచారం చేసేవారిపై చట్టపరమైన చర్యల హెచ్చరిక



2లో

## డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి

- మహిళలకు హైదరాబాద్ కొత్త సీపీ సజ్జనార్ కీలక సూచన
- ప్రైవేట్ ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవద్దని స్పష్టీకరణ
- మోసగాళ్లు వాటిని సులభంగా దుర్వినియోగం చేస్తారని వెల్లడి
- ఎవరినైనా నమ్మేముందు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సలహా
- జిటో కనెక్ట్ 2025లో మహిళా పారిశ్రామికవేత్తలతో సీపీ భేటీ

## బిట్‌కాయిన్ సరికొత్త చరిత్ర..

### లక్షా 25 వేల డాలర్ల మార్క్ దాటి ఆల్ టైమ్ రికార్డ్!



2లో

- నేడు లక్షా 25 వేల డాలర్లను దాటిన వైనం
- వరుసగా ఎనిమిదో సెషన్ కూడా లాభాల్లోనే పయనం
- అమెరికా అనుకూల నిబంధనలతో పెరిగిన సంస్థాగత పెట్టుబడులు
- యూఎస్ డాలర్ బలహీనపడటం కూడా ఒక కారణంగా విశ్లేషణ



2లో

## మహిళల వరల్డ్ కప్

- మహిళల ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం

## శ్రీశైలం ఆలయ అభివృద్ధి కోసం 2 వేల హెక్టార్ల అటవీభూమి

- తిరుమల తరహాలో శ్రీశైలాన్ని తీర్చిదిద్దేందుకు సమగ్ర మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం
- అక్టోబర్ 16న శ్రీశైలం రానున్న ప్రధాని మోదీతో ఈ అంశంపై చర్చించనున్న సీఎం
- జాతీయ రహదారులతో శ్రీశైలానికి అనుసంధానం కల్పించాలని అధికారులకు ఆదేశం
- శబరిమల తరహాలో సౌకర్యాలపై అధ్యయనం చేయాలని సూచించిన పవన్ కల్యాణ్
- అభివృద్ధికి సమానంగా పర్యావరణ పరిరక్షణ, పులుల సంరక్షణకు చర్యలు



2లో

## మోదీ, రేవంత్.. 'బడే భాయ్, చోటా భాయ్'

- తెలంగాణను మోసం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని విమర్శ
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి చూపారని ఆరోపణ
- తెలంగాణకు బీఆర్ఎస్ మాత్రమే శ్రీరామరక్ష అని స్పష్టం



2లో

## గ్రీన్ జర్నీ పేరుతో ప్రజల రక్తం పీలుస్తున్నారు

- సీఎం రేవంత్‌రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శలు
- రాష్ట్రంలో బస్సు చార్జీల పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి
- గ్రీన్ జర్నీ పేరుతో ప్రభుత్వం సామాన్యులను దోచుకుంటోందని ఆరోపణ
- బస్సు ఎక్కాలంటేనే భయపడే పరిస్థితి కల్పిస్తున్నారని మండిపాటు
- సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు



2లో

## బస్సు చార్జీల పెంపు దారుణం

- సిటీ బస్సు చార్జీల పెంపుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- ఒక్కసారే రూ.10 పెంచడం దుర్మార్గమైన నిర్ణయమన్న కేటీఆర్
- హైదరాబాద్ ప్రజలపై సీఎం కక్షగట్టారని విమర్శ



2లో

## విశాఖ బీచ్ లో ఇటలీ పర్యాటకుల గల్లంతు... ఒకరి మృతి

- విశాఖ యారాడ బీచ్‌లో తీవ్ర విషాదం
- సముద్రంలో కొట్టుకుపోయిన నలుగురు ఇటలీ పర్యాటకులు



2లో

# చైల్డ్ కేర్ సెంటర్ లో శిశువు మరణంపై విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 05 : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ సంరక్షణ కేంద్రాల్లో చోటుచేసుకున్న రెండు వేర్వేరు తీవ్రమైన ఘటనలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. అనంతపురంలోని ప్రభుత్వ శిశుగృహంలో ఏడాదిన్నర బాలుడు మృతి చెందడం, పార్వతీపురం మన్యం జిల్లాలోని గురుకుల పాఠశాలలో 85 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవ్వడంపై ఆయన ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జి. సంధ్యారాణితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతపురం శిశుగృహంలో జరిగిన బాలుడి మృతి ఘటన తీవ్ర కలకలం రేపింది. సిబ్బంది మధ్య ఉన్న వివాదాల కారణంగానే పసికందుకు సరిగా ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహించారని, అదే చిన్నారి మృతికి దారితీసిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని హడావుడిగా ఖననం చేశారన్న విమర్శలు కూడా వెల్లువెత్తాయి. కళ్యాణదుర్గానికి చెందిన ఓ మహిళ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన బిడ్డను సెప్టెంబర్ 30న శిశుగృహంలో చేర్పించారు. పుట్టుకతోనే తక్కువ బరువుతో ఉన్న ఆ చిన్నారి, దసరా రోజు (అక్టోబర్ 2న) విరేచనాలతో మృతి చెందాడు. అనంతపురం ఘటనపై జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ విచారణకు ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. నాగమణి, ప్రభుత్వ ఆసుపత్రి పీడియాట్రిక్ హెచ్‌ఓడీలతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సమగ్ర నివేదిక సమర్పించాక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. శిశుగృహం మేనేజర్‌తో పాటు ఆయాలకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి మెమోలు జారీ చేశారు.

## విశాఖ బీచ్ లో ఇటలీ పర్యాటకుల గల్లంతు... ఒకరి మృతి

విశాఖపట్నం, అక్టోబర్ 05 : నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన యారాడ బీచ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన ఇటలీ పర్యాటకులలో ఒకరు మృత్యువాత పడగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే, ఇటలీకి చెందిన 16 మంది పర్యాటకుల బృందం యారాడ బీచ్‌కు విహారయాత్రకు వచ్చింది. వీరిలో నలుగురు సముద్రంలో ఈత కొట్టేందుకు దిగారు. ఆ సమయంలో అలల ఉద్ధృతి ఒక్కసారిగా పెరగడంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. ఇది గమనించిన లైఫ్ గార్డులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. అతికష్టమ్మీద ఇద్దరిని ఒడ్డుకు చేర్చగలిగారు. ఒడ్డుకు చేర్చిన ఇద్దరికీ లైఫ్ గార్డులు వెంటనే సీపీఆర్ చేశారు. వారి ప్రయత్నం ఫలించి ఒక పర్యాటకుడు ప్రాణాలతో బయటపడగా, మరొకరు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గల్లంతైన మిగతా ఇద్దరి ఆచూకీ కోసం రెస్క్యూ సిబ్బంది సముద్రంలో ముమ్మరంగా గాలిస్తున్నారు. యారాడ బీచ్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా చాలామంది పర్యాటకులు అలల ధాటికి సముద్రంలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు.

## బిట్‌కాయిన్ సరికొత్త చరిత్ర.. లక్షా 25 వేల డాలర్ల మార్క్ దాటి ఆల్ టైమ్ రికార్డ్!

ఢిల్లీ, అక్టోబర్ 05 : ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. మునుపెన్నడూ లేని విధంగా 1,25,245.57 డాలర్ల (ఒక బిట్‌కాయిన్ విలువ రూ.1.11 కోట్లు) వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది ఆగస్టు మధ్యలో నమోదైన 1,24,480 డాలర్ల రికార్డును ఇది అధిగమించింది. నేటి మధ్యాహ్నం 2:54 గంటల సమయానికి కూడా బిట్‌కాయిన్ 1.55 శాతం లాభంతో 1,24,353.96 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. వరుసగా ఎనిమిది సెషన్ల పాటు లాభాల బాటలో పయనిస్తున్న బిట్‌కాయిన్, అమెరికా ఈక్విటీ మార్కెట్లలో సానుకూల పవనాలు, బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి (ఈటీఎఫ్) భారీగా నిధులు ప్రవహించడంతో ఈ రికార్డును అందుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం క్రిప్టో ఆస్తులలో పెట్టుబడులను సులభతరం చేసేలా నిబంధనలను సవరించడం, సంస్థాగత పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు మొగ్గు చూపడం వంటివి ఈ బుల్ రన్‌కు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. స్టేబుల్‌కాయిన్లపై నిబంధనలను ఆమోదించడం, డిజిటల్ ఆస్తులకు అనుగుణంగా యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) నిబంధనలను మార్చడం ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపింది. మరోవైపు, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్‌పై నెలకొన్న అనిశ్చితి కారణంగా యూఎస్ డాలర్ విలువ ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే బలహీనపడింది. ఇది కూడా బిట్‌కాయిన్ పెరుగుదలకు పరోక్షంగా దోహదపడింది. సాధారణంగా బిట్‌కాయిన్ 'హాల్వింగ్' ఈవెంట్ తర్వాత ఇలాంటి దీర్ఘకాలిక ర్యాలీలు చోటుచేసుకుంటాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబానికి చెందిన 'వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్' (డబ్ల్యూఎల్ఎఫ్) సంస్థ పాకిస్థాన్‌తో ఒక క్రిప్టోకరెన్సీ ఒప్పందంపై దృష్టి సారించిందని 'డిస్ఇన్ఫో ల్యాబ్' నివేదించింది. పాకిస్థాన్ కొత్తగా ఏర్పాటు చేసిన క్రిప్టో కౌన్సిల్ సీఈఓగా ఉన్న బిలాల్ బిన్ సాఖిబ్, అదే సమయంలో డబ్ల్యూఎల్ఎఫ్‌కు కూడా సలహాదారుగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. జూన్ 2025లో పాకిస్థాన్ ప్రభుత్వం డబ్ల్యూఎల్ఎఫ్, బినాన్స్‌లతో కలిసి బ్లాక్‌చెయిన్ మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు ఒప్పందాలు చేసుకున్న విషయం తెలిసిందే.

## మోదీ, రేవంత్.. 'బడే భాయ్, చోటా భాయ్': హరీశ్ రావు

హైదరాబాద్, అక్టోబర్ 05 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరూ 'బడే భాయ్, చోటా భాయ్' అని, తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో వారిద్దరిదీ ఒకే తీరని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకరిది మోసపు చరిత్ర అయితే, మరొకరిది ద్రోహపు చరిత్ర అని, ఈ రెండు పార్టీలు తెలంగాణ పాలిట శత్రువులని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడుతూ, "కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు కృతజ్ఞత కూడా చూపలేదు. నల్లధనం తెచ్చి రూ.15 లక్షలు ఇస్తామన్న హామీ, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న మాట ఏమైంది?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. రూ.350 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200కు, రూ.65 ఉన్న పెట్రోల్‌ను రూ.100కు పెంచింది బీజేపీ కాదా? అని నిలదీశారు. ఎన్నికలు రాగానే ధరలు తగ్గించినట్లు డ్రామాలు ఆడి, ఎన్నికలు ముగియగానే మళ్లీ పెంచి ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. "నమ్మి ఓటేసిన ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి నట్టేట ముంచుతున్నారు. కేసీఆర్ హయాంలో ఎన్నడూ లేనివిధంగా రైతులు నేడు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## సీనియర్ సిటిజెన్ దర్శనంపై అదంతా తప్పుడు ప్రచారమే: టీటీడీ

తిరుమల, అక్టోబర్ 05 : శ్రీవారి దర్శనానికి సంబంధించి వయోవృద్ధులు, దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తులకు స్పష్టం చేసింది. కొన్ని నెలలుగా వ్యాప్తి చెందుతున్న ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఓ ప్రకటనలో పేర్కొంది. వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం దర్శన సౌకర్యాన్ని ఆపేశారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని టీటీడీ తేల్చిచెప్పింది. ప్రతినెలా మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్‌లో 1000 టికెట్ల కోటాను విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఈ కోటాలో టికెట్లు పొందిన వారికి ఉచితంగా లడ్డూ ప్రసాదాన్ని కూడా అందిస్తున్నామని వివరించింది. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు తిరుమలలోని నంబి ఆలయం వద్ద ఉన్న ప్రత్యేక లైన్ ద్వారా వీరిని దర్శనానికి అనుమతిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. అదేవిధంగా, అలిపిరి మెట్ల మార్గంలో మద్యం తాగిన వ్యక్తులు గాజు సీసాలు పగలగొట్టి భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ వస్తున్న మరో ఆరోపణను కూడా టీటీడీ తీవ్రంగా ఖండించింది. ఆ ఘటన అలిపిరి నుంచి రుయా ఆసుపత్రికి వెళ్లే మార్గంలో జరిగిందే తప్ప, టీటీడీ పరిధిలోని నడకమార్గంలో కాదని స్పష్టం చేసింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకే ఇలాంటి అసత్యాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. భక్తులు ఇలాంటి వదంతులను నమ్మకుండా, కేవలం టీటీడీ అధికారిక వెబ్ సైట్లైన tirumala.org లేదా ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించింది. సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## గ్రీన్ జర్నీ పేరుతో ప్రజల రక్తం పీలుస్తున్నారు

హైదరాబాద్, అక్టోబర్ 05 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంచడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సామాన్య ప్రజలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకంత కోపమని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తన నిరసనను వ్యక్తం చేశారు. "గ్రీన్ జర్నీ పేరుతో ప్రభుత్వం సామాన్యుల రక్తాన్ని పీల్చేస్తోంది. బస్సు ఎక్కడమే పాపం అన్నట్లుగా ప్రజల జేబులను గుల్ల చేస్తున్నారు" అని కవిత తన పోస్టులో తీవ్రంగా విమర్శించారు. ఇటీవలే బస్సు పాస్‌ల ధరలను పెంచి చిరుద్యోగులు, విద్యార్థులపై పెనుభారం మోపిన ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా బస్సు చార్జీలను అమాంతం పెంచేయడం దారుణమని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు సామాన్యుడి నడ్డి విరిచేలా ఉన్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణాను ప్రజలకు దూరం చేసేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

## డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి: సీపీ

హైదరాబాద్, అక్టోబర్ 05 : డిజిటల్ ప్రపంచం ఓ మాయాజాలం... ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అంతే స్థాయిలో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి... ముఖ్యంగా మహిళలు ఆన్‌లైన్ వేదికలపై వ్యక్తిగత ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో పొంచి ఉన్న ముప్పు గురించి వివరిస్తూ, మహిళలు మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని ఆయన కీలక సూచనలు చేశారు. నగరంలో జరుగుతున్న జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) కనెక్ట్ 2025 కార్యక్రమంలో భాగంగా ఆయన మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవలే నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, ఈ వేదికగా మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో ఈ విషయంపై ఆయన పోస్ట్ చేశారు. "చాలామంది మహిళలు తమ ప్రైవేట్ ఫోటోలను, వ్యక్తిగత విషయాలను ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. కానీ వాటిని దుండగులు సులభంగా దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. నకిలీ గుర్తింపులతో పరిచయం చేసుకొని, నమ్మించి మోసం చేసే వారి సంఖ్య పెరిగిపోతోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోసపోయారని గ్రహించిన తర్వాత కూడా కొందరు వారితో సంభాషణలు కొనసాగిస్తున్నారని, ఇది మరింత ప్రమాదకరమని సజ్జనార్ స్పష్టం చేశారు. అలాంటి చర్యలు బ్లాక్‌మెయిలింగ్‌కు ఆస్కారం కల్పిస్తాయని తెలిపారు. "ఆన్‌లైన్‌లో ఎవరినైనా గుడ్డిగా నమ్మవద్దు. ఏదైనా సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ధృవీకరించుకోవాలి. డిజిటల్ ప్రపంచాన్ని అందరికీ సురక్షితంగా మార్చేందుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో సజ్జనార్ మహిళల శక్తిసామర్థ్యాలను కొనియాడారు. హైదరాబాద్ పోలీస్ విభాగంలో తన బృందంలో దాదాపు 50 శాతం మంది మహిళా ఐపీఎస్ అధికారులే ఉండటం గర్వకారణంగా ఉందని అన్నారు. "వారు ఒకవైపు ఇంటి బాధ్యతలను, మరోవైపు కఠినమైన వృత్తిపరమైన విధులను ఎంతో అంకితభావం, క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. నేటి భారతదేశానికి మహిళలు ప్రతిఘటన, నాయకత్వం, ఆవిష్కరణలకు నిజమైన ప్రతీకలు. వారు మొత్తం ప్రపంచానికే స్ఫూర్తి, బలం" అని ఆయన ప్రశంసించారు. అక్టోబర్ 3న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించిన ఈ జిటో కనెక్ట్ 2025 ప్రదర్శన మూడు రోజుల పాటు సాగనుంది. ఇందులో 600కు పైగా స్టాళ్లు, ఆరు భారీ అరీనాలు ఏర్పాటు చేశారు. బిల్డ్ మార్ట్, బిజినెస్ బే, ప్రాపర్టీ పెవిలియన్ వంటి విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో బాబా రాందేవ్, కమలేశ్ పటేల్ (దాదాజీ), సినీ నటుడు బొమన్ ఇరానీ, క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ వంటి పలువురు ప్రముఖులు పాల్గొని

## మహిళల వరల్డ్ కప్: ఆల్ రౌండ్ షోతో పాకిస్థాన్ ను మట్టికరిపించిన భారత్

అది పురుషుల క్రికెట్ అయినా, మహిళల క్రికెట్ అయినా... వరల్డ్ కప్ చరిత్రలో పాకిస్థాన్ చేతిలో ఇప్పటివరకు భారత్ ఓడింది లేదు. ఇప్పుడు కూడా అదే ఆనవాయతీ కొనసాగింది. ఐసీసీ మహిళల ప్రపంచకప్ 2025లో భాగంగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియం వేదికగా జరిగిన ఈ పోరులో టీమిండియా 88 పరుగుల భారీ తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. 248 పరుగుల లక్ష్యఛేదనలో పాక్ చేతులెత్తేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు స్మృతి మంధాన (23), ప్రతిక రావల్ (31) శుభారంభం అందించారు.

## బస్సు ఛార్జీల పెంపు దారుణం: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 05 : జంట నగరాల్లో సిటీ బస్సు ఛార్జీలను పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక్కేసారి కనీస ఛార్జీని ఏకంగా 10 రూపాయలు పెంచడం దుర్మార్గమని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో బస్సు ఛార్జీలు పెంచడం వల్ల ప్రతి ప్రయాణికుడిపై నెలకు అదనంగా 500 రూపాయల భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కనీస ఛార్జీపై ఏకంగా 50 శాతం పెంచడం దారుణమని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలు, టీ24 టికెట్ ధరలు పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రజలపైనా భారం మోపుతోందని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం విఫలమవడం వల్లే ఆర్టీసీ దివాళా తీసిందని, ఇప్పుడు ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. రాజధాని వాసులపై రోజుకు కోటి రూపాయల భారం మోపే ఈ నిర్ణయం, హైదరాబాద్ ప్రజలపై ముఖ్యమంత్రికి ఉన్న కక్షను స్పష్టం చేస్తోందని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# చలాన్ల విషయంలో కఠినంగా మారనున్న రూల్స్.. నిర్లక్ష్యం చేస్తే లైసెన్స్ రద్దు

ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా వాహనం నడుపుతున్నారా.. మీ వాహనంపై ట్రాఫిక్ చలాన్ పడినా పట్టించుకోవడంలేదా.. అయితే, మీరు అప్రమత్తం కావాల్సిన సమయం వచ్చేసింది. పెండింగ్ చలాన్లు ఎన్ని ఉన్నా పోలీసులు ఆపినప్పుడు కడదాంలే అనుకుంటే ఇకపై కుదరదు. చలాన్ పడిన 45 రోజుల్లోగా చెల్లించలేదంటే అంతే.. ఐదు చలాన్లకు మించి పెండింగ్ లో ఉంటే లైసెన్స్ రద్దయినట్లు మీ మొబైల్ కు మెసేజ్ వస్తుంది. డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్ కాకపోవచ్చు కూడా.. మీ వాహనాన్ని ట్రాఫిక్ సిబ్బంది సీజ్ చేసే అవకాశం ఉంది. పెండింగ్ చలాన్ల విషయంలో కేంద్రం కఠిన చర్యలను ప్రతిపాదిస్తూ సెంట్రల్ మోటారు వెహికిల్స్ రూల్స్ 1989లో కేంద్ర రవాణాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డ్రాఫ్ట్ రూల్స్ నోటిఫికేషన్‌ను తాజాగా విడుదల చేసింది. చలాన్ల జారీ, చెల్లింపు, అప్పీల్ చేయడం వంటి అంశాలను డిజిటల్ మానిటరింగ్, ఆటోమేషన్ ఆధారంగా వేగవంతం చేయాలని తెలిపింది. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారుకు సంబంధిత అధికారులు




మూడురోజుల్లోగా ఎలక్ట్రానిక్ రూపంలో నోటీసు జారీ చేయాలని, ఫిజికల్ రూపంలో 15 రోజుల్లోగా నోటీసు పంపాలని స్పష్టం చేసింది.

**కొత్త రూల్స్ ఇవే..**

* మోటారు వెహికిల్ యాక్టు కింద ఒక వాహనంపై 5 లేదా అంతకంటే ఎక్కువ చలాన్లు జారీ అయితే డ్రైవింగ్ లైసెన్సును సస్పెండ్ చేయొచ్చు.
* చలాన్ చెల్లించడానికి ప్రస్తుతం ఉన్న 90 రోజుల గడువు 45 రోజులకు తగ్గింపు.
* ఈ గడువు దాటితే సదరు వాహనాన్ని అమ్మడం కుదరదు. డ్రైవింగ్ లైసెన్సులో మార్పులకు కానీ రెన్యువల్ కు కానీ వీలుండదు.
* చలాన్ కట్టకపోతే వాహనాన్ని స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉంటుంది.
* ప్రస్తుత నిబంధనల ప్రకారం.. వాహనం ఎవరు నడిపినా రూల్స్ అతిక్రమిస్తే వాహన యజమాని పేరుపైనే చలాన్ జారీ అవుతోంది. ఇకపై, వాహనం నడిపిన వ్యక్తిని బాధ్యుడిగా చేయనున్నారు.

# చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఏళ్ల తరబడి చేస్తున్న రోడ్డు వెడల్పు పనులు పూర్తికాకపోవడంతో జాతీయ రహదారి చెరువుగా మారింది. సైడ్ కాల్వలు పూర్తి చేయకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా జాతీయ రహదారిపై నీళ్లు నిలిచి చెరువును తలపిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ - జగదల్‌పూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొత్తగూడెం పట్టణ పరిధిలోని సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు గల జాతీయ రహదారి విస్తరణ పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. సుమారు ఆరేళ్ల క్రితం పనులు ప్రారంభించినా, ఇప్పటివరకు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డు వెడల్పు సమయంలో జాతీయ రహదారి అధికారులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. పనులు





పూర్తి అయినట్టే బిల్డప్ ఇచ్చిన వారు ఇప్పుడు కనిపించడం లేదు. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో పోస్టాఫీస్ సెంటర్ సమీపంలోని సెయింట్ మేరీస్ పాఠశాల వద్ద జాతీయ రహదారి పూర్తిగా నీటమునిగిపోయింది. ప్రతిరోజు ఈ రహదారి గుండా ప్రయాణించే వందలాది వాహనదారులు, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రాణాలకు తెగించి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడిన ప్రతీసారి ఇదే సీన్ రిపీట్ అవుతూ వస్తోంది. అయినా జాతీయ రహదారి అధికారులు మాత్రం మిన్నకుండి చోద్యం చూస్తున్నారు తప్ప సంబంధిత కాంట్రాక్టర్‌పై మాత్రం చర్యలు తీసుకోవడంలేదు. ఇక ప్రజా ప్రతినిధులు కూడా రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్ల నుంచి మామూళ్లు దండుకున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అందుకే ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడంలేదని కొందరు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు స్పందించి జాతీయ రహదారిపై నెలకొన్న సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కలెక్టరేట్ సమీపంలో భారీ కొండచిలువ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) సమీపంలో శనివారం అర్ధరాత్రి 12 అడుగుల భారీ కొండచిలువ కన్పించింది. ఇది గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులు, మున్సిపల్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ జిమ్ సంతోష్‌కు సమాచారం ఇచ్చారు. సంతోష్ ఎంతో చాకచక్యంగా ఆ కొండ చిలువను బంధించి అదే రాత్రి దట్టమైన రిజర్వ్ ఫారెస్ట్‌లో విడిచిపెట్టారు. కొండచిలువ గర్భంతో ఉందని, స్థావరం వెతుక్కుంటూ వచ్చి ఉండొచ్చని, భారిగా ఉన్నపటికీ విష రహిత సర్పమే అని, భయం అక్కర్లేదని సంతోష్ స్థానికులకు అవగాహన కల్పించారు. వన్యప్రాణి చట్టం షెడ్యూల్ ఎ కేటగిరి లోకి ఈ పాము వస్తుందని వివరించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు రామ్ ప్రసాద్, బావో సింగ్, బేస్ క్యాంప్ గణేష్, శ్రీకాంత్, మహేష్ డ్రైవర్ ఏడు కొండలు సంఘటన స్థలం వద్ద ఉన్నారు.

## జగద్గిరిగుట్ట డివిజన్ సర్వమతాలకు నిలయం

* **జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట , (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ సర్వమతాల కు నిలయమని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్ లో స్థానిక మైనార్టీ సోదరులు గ్యార్మి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన పాల్గొని దర్గా ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కొలుకుల జగన్ మాట్లాడుతూ మతసామరస్యాలకు ప్రతీకగా వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. గ్యార్మి ఉత్సవాలు మన సంస్కృతి,ఐక్యతను చాటిచెప్పుతాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొలుకుల జైహింద్, కాంగ్రెస్ నాయకులు ఐలయ్య గౌడ్, నాయకులు సాదిక్ మహమ్మద్ సులేమాన్ ప్రభు. ఫిరోజ యాదగిరి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## డిబేట్ లు విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తాయి

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : డిబేట్ లు విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యాన్ని, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం మేడ్చల్ నియోజకవర్గం కండ్ల కొయ్యలోని నీరజ్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు నిర్వహించిన "సెరెన్ మున్ 2025" మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై కాన్ఫరెన్స్ లో డిఐఎస్ఈసీ, యుఎన్హెచ్ఆర్సీ, ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫీ, లోక్ సభ, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ విభాగాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ డిబేట్ లు విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యాన్ని, విషయపరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు నాయకత్వ లక్షణాలను తీర్చిదిద్దుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తనీష్ గౌడ్, శివరామ్ గౌడ్, హర్షిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సేవల సవరించిన ఛార్జీలు స్పష్టంగా ప్రదర్శించాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఆధార్ సేవలపై సవరించిన కొత్త రుసుములు 2025 అక్టోబర్ 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఈ మార్పులపై పూర్తి అవగాహన కల్పించే విధంగా అన్ని ఆధార్ సేవా కేంద్రాల్లో కొత్త రుసుముల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. బయోమెట్రిక్ అప్‌డేట్ (ఫింగర్‌ప్రింట్, ఐరిస్, ఫోటో) కోసం 5-7, 15-17 ఏళ్ల పిల్లలకు ఒకసారి అప్‌డేట్ చేయడం ఉచితమని, మిగతా సందర్భాల్లో రూ.125 మాత్రమే వసూలు చేయాలన్నారు. డెమోగ్రాఫిక్ అప్‌డేట్ అంటే పేరు, లింగం, జన్మతేదీ, చిరునామా, మొబైల్, ఇమెయిల్ వంటి వివరాలను మార్చడం బయోమెట్రిక్ అప్‌డేట్‌తోపాటు చేస్తే ఉచితమని, వేరుగా చేస్తే రూ.75 మాత్రమే వసూలు చేయాలని చెప్పారు. డాక్యుమెంట్ అప్‌డేట్ అంటే ఐడీ, చిరునామా డాక్యుమెంట్స్ సమర్పించడం వంటివి మై ఆధార్ పోర్టల్ ద్వారా చేస్తే ఉచితమని, ఎన్‌రోల్మెంట్ సెంటర్ ద్వారా చేస్తే రూ. 75 వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. హోమ్ ఎన్‌రోల్మెంట్ సర్వీస్ కోసం ఫీజు రూ.700, ఒకే చిరునామాకు బహుళ మంది తీసుకుంటే మొదటి వ్యక్తికి రూ.700, మిగతా వ్యక్తులకి రూ.350 చార్జ్ చేయాలన్నారు. ఆధార్ డౌన్‌లోడ్ చేసి ముద్రించుకోవడానికి రూ.40 చెల్లించవలసి ఉంటుంది అని తెలిపారు. జిల్లా ప్రజలు ఆధార్ సంబంధిత సేవల కోసం కేవలం అధికారిక ఆధార్ సేవా కేంద్రాలు లేదా గుర్తింపు పొందిన సెంటర్లను మాత్రమే వినియోగించాలని కోరారు. ప్రజల్లో ఏ విధమైన అపోహలు లేకుండా సవరించిన రుసుములపై విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



## ఘనంగా ఆర్ ఎస్ ఎస్ పదసంచాలన్

* **జిన్నారంలో ఘనంగా ఆర్ఎస్ఎస్ శతజయంతి వేడుకలు**
* **ఉత్సాహంగా పాల్గొన్న సంఘ్ సభ్యులు**



జిన్నారం,ప్రజాస్ఫూర్తి 05: మండల కేంద్రమైన జిన్నారం లో ఆర్ ఎస్ ఎస్ సభ్యులు 100 సంవత్సరాల జయంతి వేడుకల్లో భాగంగా భారీ పద సంచాల న్ (ర్యాలీ) ని నిర్వహించారు. మండల హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఆర్ఎస్ఎస్ శతజయంతి వేడుకలలో భాగంగా నిర్వహించారు. మున్సిపాలిటీ కేంద్రంలో నీ పుర వీధుల గుండా ఘోష్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వీధుల గుండా స్థానికులు పూలు చల్లి స్వాగతం పలికారు. అనంతరం ఆర్ఎస్ఎస్ ముఖ్య అతిథిలు రవి కుమార్ మాట్లాడుతూ హిందూ సమాజాన్ని ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. కార్యక్రమంలో హిందూ జాగరణ సమితి అధ్యక్షుడు ఆనంద్ చారి, ప్రత్యేక ఆహ్వానితులు కరుణాసాగర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టెంట్ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు బ్రహ్మేందర్, సంగ్ ప్రముకులు గంగు భాస్కర్, వినోద్ రెడ్డి,మధు,శ్రీకాంత్ లు పాల్గొన్నారు.



## పదవీ విరమణ జర్నలిస్టులకు పెన్షన్ అందించాలి..

### డిప్యూటీ సీఎం భట్టికి వయోధిక పాత్రికేయ సంఘం విజ్ఞప్తి

పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని వర్తింప చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో 17వ అంశంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని వయోధిక పాత్రికేయ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర సంఘం నాయకులు కేశవరావు, లక్ష్మణరావు, ఎన్. శ్రీనివాసరెడ్డి, బండారు శ్రీనివాసరావు, సి.కేశవులు, ఫాజిల్, వేణుగోపాల్ లతో కూడిన బృందం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంఘ నాయకులు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి ఈ అంశంపై విజ్ఞాపన పత్రాన్ని అందజేస్తే.. సానుకూలంగా స్పందించినట్లు వయోధిక పాత్రికేయ సంఘం సభ్యులు గుర్తుకు చేశారు. దేశంలోని 19 రాష్ట్రాల్లో పెన్షన్ పథకం అమలులో ఉన్నదని వారు తెలిపారు. కర్ణాటకతో సహా పలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కూడా ఈ పథకం అమలులో ఉందని, ఈ విషయం కమిటీ వేసి క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించి అమలు జరిగేటట్లు ప్రయత్నిస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారని సంఘ నాయకులు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి సోదరులు అనుముల కృష్ణ రెడ్డి కి దసరా పండుగ శుభాకాంక్షలు



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : విజయ దశమి పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సోదరులు అనుముల కృష్ణ రెడ్డి ని తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొత్త సుశాంత్ గౌడ్ , మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ , యువనాయకులు కొత్త విక్రమ్ గౌడ్ , టీపీసీసీ గాంధీ భవన్ మీడియా కోఆర్డినేటర్ గణేష్ నాయక్ , ఓంసాయి గౌడ్, ప్రశాంత్ గౌడ్ ,జగదీష్ గౌడ్, అభినవ్ గౌడ్,సురేష్ లు కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించిన 'మాటూరి'




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చెన్నైలో బాలమురుగన్ నిర్వహించిన ప్రత్యేక గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణం గాజులరాజం బస్తీకి చెందిన మార్షల్ ఆర్ట్స్ గురువు మాటూరి మహావిష్ణుమూర్తి పాల్గొని, అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ఆదివారం చెన్నైలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక అధిపతి రిషి నాద్ హాజరై మాటూరి మహావిష్ణుమూర్తికి గౌరవపూర్వకంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు మెడల్, సర్టిఫికెట్‌ను అందజేశారు. మహావిష్ణుమూర్తి తన కృషి, అంకితభావంతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పారని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

## వర్షం కురిస్తే చాలు.. చెరువులుగా మారుతున్న కాలనీ

* **స్థానిక నాయకులు, అధికారులు స్పందించాలని స్థానికుల విజ్ఞప్తి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని సంజయ్‌నగర్ గ్రామపంచాయతీ హమాలీ కాలనీ సమీపంలోని సరస్వతీ కాలనీలో వర్షం కురిసినప్పుడల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పంపు బాయ్ ఏరియాలో వర్షపు నీరు, మురుగు నీటికి సరైన నిష్క్రమణ దారి లేకపోవడంతో, వర్షం వచ్చినప్పుడు మొత్తం నీరు రోడ్డుపై చేరి చెరువులను తలపించేలా మారుతోంది. దీంతో పాఠశాల విద్యార్థులు, కాలనీవాసులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# పిటిషనర్లకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా.. బీసీ రిజర్వేషన్ల కేసు విచారణపై మంత్రి పొన్నం సూచనలు

హైదరాబాద్, అక్టోబర్ 05 : తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకునే ప్రయత్నం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల కేసు రేపు సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ఒక వీడియో తన ఎక్స్ ఖాతా వేదికగా విడుదల చేశారు. పిటిషనర్లకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు నష్టం కలిగించేది కాదని సూచించారు. బలహీన వర్గాలకు చేయూతగా ఉండే విధంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాహుల్‌గాంధీ ఆలోచన ప్రక్రియలో రిజర్వేషన్లు ముందుకు తీసుకుపోతున్నామని అన్నారు. కొంతమంది వ్యక్తిగతంగా రెడ్డి జాగృతి పేరుతో చేస్తున్నప్పటికీ అందరికీ సంబంధం అనే మాట కాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బలహీన వర్గాలకు పెద్దలంతా సపోర్ట్‌గా ఉండాలని సూచించారు. రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు ఉన్న హక్కు మాదిరి బీసీలకు కూడా హక్కు ఉండాలని ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఏకాభిప్రాయంతో ఈ బిల్లు ముందుకు పోయిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు న్యాయ స్థానాల్లో రాజకీయ పార్టీల మద్దతే ప్రజల మద్దతు అని చెప్పాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, టీపీసీసీ ,ఏఐసీసీ ఇన్చార్జి సూచనల మేరకు తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి వాకిటి శ్రీహరి ఢిల్లీ వెళ్తున్నామని అన్నారు. అక్కడ సీనియర్ న్యాయవాదులను కలుస్తామని చెప్పారు. బలహీన వర్గాల సామాజిక న్యాయానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు.



## అద్దె కారు కోసం సెర్చ్ చేసి.. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కిన హైదరాబాద్ వాసి

హైదరాబాద్, అక్టోబర్ 05 : కారు అద్దెకు తీసుకునేందుకు ప్రయత్నించి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న ఓ వ్యక్తి రూ.2లక్షలు పోగొట్టుకున్నాడు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ లాలాగూడకు చెందిన ఓ వ్యక్తి కోయంబత్తూరులో కారు అద్దెకు తీసుకునేందుకు గూగుల్‌లో సెర్చ్ చేశాడు. శివశక్తి కార్ రెంటల్స్ పేరు చూసి వెబ్‌సైట్‌లో ఉన్న ఫోన్ నెంబర్‌కు సంప్రదించాడు. రిజిస్ట్రేషన్ కింద రూ.149 చెల్లించాలని, ఏపీకే ఫైల్ పంపి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అది నిజమేనని నమ్మిన బాధితుడు రిజిస్ట్రేషన్ చేసుకొని రూ.149 చెల్లించాడు. ఏపీకే ఫైల్‌లో ఉన్న మాల్వేర్ ద్వారా ఓటీపీలు రాకుండా ఫార్వర్డ్ చేసిన సైబర్ మాయగాళ్లు.. బాధితుడి ఖాతాలోని రూ.1.98లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



## హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా పలుచోట్ల వర్షం



హైదరాబాద్, అక్టోబర్ 05 : హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా పలు చోట్ల వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్, పంజాగుట్ట, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లక్డీకపూల్, లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లోయర్ ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్, కుత్బుల్లాపూర్, చింతల్ సాయినగర్, మల్కాజిగిరి, ముషీరాబాద్, సికింద్రాబాద్ వెస్ట్‌మారేడ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రహదారులపై నీరు నిలవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో అత్యధికంగా 11 సెం.మీ వర్షపాతం నమోదైంది. లింగాల(ఖమ్మం)లో 10సెం.మీ, మొగడంపల్లి(సంగారెడ్డి)లో 9.8 సెం.మీ, పల్లెగూడెం(ఖమ్మం)లో 8.98 సెం.మీ, మేడారం(ములుగు)లో 8.43 సెం.మీ, పుల్కల్(సంగారెడ్డి)లో 7.45 సెం.మీ, గూడూర్(జనగామ)లో 7.38 సెం.మీ, వికారాబాద్ జిల్లా ఖాసింపూర్, బషీరాబాద్‌లో 7 సెం.మీ, పెరుమాండ్ల సంకీస(మహబూబాబాద్)లో 7 సెం.మీ, కొండాపూర్(సంగారెడ్డి)లో 6.48 సెం.మీ, మోమిన్‌పేట్(వికారాబాద్)లో 6.35 సెం.మీ వర్షపాతం, కూనారం(పెద్దపల్లి)లో 6.18 సెం.మీ, కాసిందేవిపేట(ములుగు)లో 8.78 సెం.మీ వర్షపాతం నమోదైంది.

### తెలుగు రాష్ట్రాలకు ఎల్లో అలర్ట్

బిహార్ నుంచి తమిళనాడు వరకు ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తెలంగాణలో చాలా ప్రాంతాలకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచన ఉంది. కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల భారీ వర్ష సూచన ఉంది. ఈశాన్య, వాయవ్య అరేబియా సముద్రంలో శక్తి తీవ్ర తుపానుగా కొనసాగుతోంది. ద్వారకకు తూర్పుగా 530 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. రేపు ఒమన్‌లో తీవ్రతుపాను తీరం దాటే అవకాశం ఉంది.

## జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు.. నలుగురి పేర్లతో జాబితా

హైదరాబాద్, అక్టోబర్ 05 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం కసరత్తు పూర్తి చేసింది. నలుగురి పేర్లతో జాబితాను ఖరారు చేసినట్లు సమాచారం. షార్ట్ లిస్టులో నవీన్‌యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్ పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. నలుగురి పేర్లతో కూడిన జాబితాను అధిష్ఠానానికి పంపనుంది. ఈ జాబితాను పరిశీలించి.. జూబ్లీహిల్స్ అభ్యర్థిని ఏఐసీసీ ప్రకటించనుంది. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఈ సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. ఆయనతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం వెళ్లనున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో కేసు దృష్ట్యా ఈ నేతల ఢిల్లీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఢిల్లీలోని సీనియర్ న్యాయవాదులను కలిసి.. బలమైన వాదనలు వినిపించేలా వారితో చర్చించనున్నట్లు సమాచారం.

## టీజీ ఈఏపీసెట్ బైపీసీ అడ్మిషన్లకు కౌన్సిలింగ్.. షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 05 : టీజీఈఏపీసెట్ బైపీసీ స్ట్రీమ్ మొదటి దశ అడ్మిషన్ల కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేసినట్లు కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కన్వీనర్ టీజీఈఏపీసెట్ (బైపీసీ) దేవసేన తెలిపారు. 13 వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బీ ఫార్మసీ, ఫార్మా డీ, బయో టెక్నాలజీ, బయో మెడికల్, ఫార్మాసుటికల్ కోర్సులకు అడ్మిషన్లు జరగనున్నట్లు తెలిపారు. 8 వరకు ఫీజ్ పేమెంట్ , స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. 7 నుంచి 9వ తేది వరకు స్లాట్ బుకింగ్ చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 7 నుంచి 10వ తేదీ వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోర్సుల ఎంపిక ప్రక్రియ, 13వ తేదీ వరకు సీట్ అలాట్మెంట్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు.




## నా రాజీనామా ప్రచారం అవాస్తవం: దానం నాగేందర్

హైదరాబాద్, అక్టోబర్ 05 : ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఖండించారు. రాజీనామా ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేశారు. "నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదు. నేనంటే గిట్టనివాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. రాజీనామా అనే ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు" అని విజ్ఞప్తి చేశారు.



# ఆదిలాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కంటైనర్

ఆదిలాబాద్, అక్టోబర్ 05 : ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన ఓ కంటైనర్ వెనుక నుంచి లారీని బలంగా ఢీకొట్టింది. గుడిహత్నూర్ మండలం సీతగొంది గ్రామం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. మంటల్లో లారీ, కంటైనర్ రెండూ కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఫైర్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చి మంటలు ఆర్పుతున్నారు. రోడ్డు ప్రమాదం కారణంగా దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. డ్రైవర్లు, క్లీనర్లు వెంటనే అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.






## చింతమడకకు కవిత.. బాల్య స్నేహితురాలికి పరామర్శ

సిద్దిపేట, అక్టోబర్ 05 :: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన చిన్ననాటి స్నేహితురాలు వెంకటలక్ష్మిని పరామర్శించారు. ఇటీవల ఆమె భర్త మల్లారెడ్డి మృతి చెందడంతో చింతమడకకు వచ్చిన కవిత.. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. "20 రోజుల వ్యవధిలోనే రెండోసారి చింతమడకకు రావాల్సి వచ్చింది. ఈ విషాద సమయంలో నా బాల్య మిత్రురాలిని ఓదార్చడం.. స్నేహితురాలిగా భరోసా ఇవ్వడం నా బాధ్యత. 20 రోజుల క్రితం బతుకమ్మ పండగకు వచ్చినప్పుడు గ్రామ ప్రజలంతా పెద్దఎత్తున స్వాగతం పలికారు. వెంకటలక్ష్మి, బాలమణిలతో కలిసి చిన్నప్పుడు బతుకమ్మ ఆడుకున్న రోజులను గుర్తుచేసుకున్నాం. ఆడబిడ్డకు భర్తను కోల్పోవడాన్ని మించిన దుఃఖం ఇంకొకటి ఉండదు. ఈ కష్టం నుంచి ఆమె బయటపడాలని, కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా" అని కవిత పేర్కొన్నారు.

## సొంతూళ్ల నుంచి HYD బాటపట్టిన నగరవాసులు.. TGRTC కీలక నిర్ణయం



హైదరాబాద్, అక్టోబర్ 05 : దసరా పండుగ తిరుగు ప్రయాణం నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆదివారం సాయంత్రం నాలుగు గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు 1050 స్పెషల్ బస్సులను సంస్థ ఏర్పాటు చేసింది. అందులో అత్యధికంగా వరంగల్ రీజియన్ నుంచి 229, కరీంనగర్ నుంచి 211, నల్గొండ నుంచి 137 ప్రత్యేక సర్వీసులని నడిపింది. ఆదివారం రాత్రి 9 గంటల వరకు రద్దీ కొనసాగనుందని భావిస్తున్నారు. అలాగే, సోమవారం కూడా హైదరాబాద్‌కు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండనుంది. అందుకే రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

# ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగనివ్వం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

పలాస: శ్రీకాకుళం జిల్లా పలాసలో నిర్మించ తలపెట్టిన ఎయిర్‌పోర్ట్ వల్ల ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగదని పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. పరిసర గ్రామాల రైతులతో ఆదివారం పలాస రైల్వేగ్రౌండ్స్‌లో ఈమేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు.. ప్రతీ గ్రామంలో సభలు పెట్టి, అందరి ఆమోదంతోనే పనులు మొదలు పెడతామని చెప్పారు. తొలుత విమానాశ్రయ నిర్మాణ ప్రాంతవాసులతో మాట్లాడి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిడిమి, మెట్టూరు, చీపురుపల్లి, భేతాళపురం, లక్ష్మీపురం తదితర గ్రామాల ప్రజలు తమ వాదనలను వినిపించారు. సదస్సుకు హాజరైన వారంతా ముక్తకంఠంతో సమ్మతి తెలిపారు. తమ భూములకు అందించే ధర, స్థానికంగా ఉపాధి, వంద శాతం భూమిని కోల్పోయే వారికి అందించాల్సిన అదనపు సహకారం వంటి విషయాలను సమావేశం దృష్టికి తెచ్చారు. ఏ గ్రామంలో ఎంతమేర భూమి అవసరమో కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. గ్రామస్థుల అభిప్రాయాలను నిశితంగా విన్న కేంద్ర మంత్రి.. వాటిని నమోదు చేసుకున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.





## భారత నౌకాదళంలోకి
# మరో యుద్ధనౌక 'ఆండ్రోత్'

విశాఖపట్నం: విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో రెండో 'యాంటీసబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్' 'ఆండ్రోత్'ను వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధర్కర్ సోమవారం జాతికి అంకితం చేయనున్నారు. భారత నౌకాదళం స్వదేశీకరణ ప్రయత్నాల్లో ఇది మరో మైలురాయి కానుంది. ఇటీవలే అత్యాధునిక యుద్ధనౌకలు అర్నాలా, నిస్తార్, ఉదయగిరి, నీలగిరిల ప్రవేశంతో నౌకాదళంలో కొత్త ఉత్సాహం నెలకొంది. లక్షద్వీప్‌లోని ఓ ద్వీపం పేరైన 'ఆండ్రోత్'ను ఈ నౌకకు పెట్టారు. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ సంస్థ దీన్ని నిర్మించింది.

# కురుపాం గురుకులంలో ఇద్దరు విద్యార్థినుల మృతి బాధాకరం: పవన్ కల్యాణ్



అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల విద్యార్థినుల్లో పచ్చకామెర్ల వ్యాప్తిపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. జిల్లా అధికారులు, వైద్యులను అడిగి స్థానిక పరిస్థితులను తెలుసుకున్నారు. విద్యార్థినులు అనారోగ్యానికి గురైన విషయం తనను బాధించిందని ఓ ప్రకటనలో తెలిపారు. ఇద్దరు బాలికల మృతిపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అదనపు సిబ్బందిని నియమించి నిరంతరం వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. త్వరలో కురుపాంలో పర్యటించనున్నట్లు చెప్పారు.




# వాణిజ్య నౌక 'శివాలిక్'.. తొలిసారి విశాఖ పోర్ట్‌కు రాక

విశాఖపట్నం: దేశానికి చెందిన వాణిజ్య నౌక 'శివాలిక్' దేశంలోనే తొలిసారి విశాఖపట్నం పోర్ట్‌కు రానుంది. వీఎల్‌జీసీ (వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్)గా గుర్తింపు పొందిన ఈ నౌకను భారత జెండా కింద 'షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' కొనుగోలు చేసింది. కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ సోమవారం విశాఖలో దీనికి స్వాగతం పలకనున్నారు. తన తొలి ప్రయాణంలో ఈ నౌక ఎల్పీజీని విశాఖపట్నం పోర్ట్‌కు తీసుకొస్తోంది. భారత సముద్ర రవాణా వాణిజ్య రంగంలో 'శివాలిక్' కీలక పాత్ర పోషించనుంది. దేశీయ అవసరాలు తీర్చడంతోపాటు అంతర్జాతీయంగా గ్యాస్ రవాణాకి ఒక ముఖ్యమైన సాధనంగా ఉపకరించనుంది. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులనూ కేంద్ర మంత్రి ప్రారంభించనున్నారు. పోర్ట్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ సామర్థ్యాల పెంపు, పర్యావరణహిత చర్యలతో 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'కు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను చేపట్టారు.

## ఏపీ ప్రజలకు అలర్ట్!..
# రాబోయే 3 గంటల్లో పలుచోట్ల పిడుగులు పడే అవకాశం

అమరావతి: ఏపీలోని పలు జిల్లాల్లో రానున్న మూడు గంటల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించింది. విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, కోనసీమ, గుంటూరు, పల్నాడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు.. ఆయా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ చెట్ల కింద ఉండొద్దని సూచించారు. మరోవైపు, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆయా జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని తెలిపారు.

# తిరుమల తరహాలో శ్రీశైలం క్షేత్రం.. సీఎంకు పవన్ కీలక ప్రతిపాదనలు



అమరావతి, అక్టోబర్ 05 : రాష్ట్రంలో తిరుమల తర్వాత అత్యంత ప్రాచుర్యం కలిగిన పుణ్యక్షేత్రం శ్రీశైలం. శ్రీవారిని దర్శించుకునే మాదిరిగానే మల్లిఖార్జున స్వామిని కూడా భక్తులు దర్శించుకుంటారు. తెలుగు రాష్ట్రాలే కాదు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామికి మొక్కులు కోరుకుంటారు. అయితే శ్రీశైలం ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయాలనే అభిప్రాయం ప్రతి ఒక్కరిలో ఉంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం దేవాలయ అభివృద్ధి ప్రణాళికలపై దేవాదాయ, అటవీ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయశాఖ, అటవీ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. అటవీ ప్రాంతంలో ఉన్న శబరిమల లాంటి దేవాలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధ్యయనం చేసి శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేద్దామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతిపాదించారు.

## దసరా ముగిసినా..
# భవానీ నామస్మరణతో మార్మోగుతున్న ఇంద్రకీలాద్రి

విజయవాడ, అక్టోబర్ 05 : భవానీ నామస్మరణతో ఇంద్రకీలాద్రి మార్మోగుతోంది. దసరా మహోత్సవాల ముగిసినప్పటికీ భవానీ భక్తుల ప్రవాహం కొనసాగుతుంది. ఆదివారం తెల్లవారుజామునుంచి నైవేద్యం సమయం వరకు అమ్మవారిని 68,540 మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం దీక్షా విరమణ చేసి ముందుకు సాగుతున్నారు. అయితే అంచనాలకు మించి భక్తులు వచ్చారు. దీంతో దేవస్థానం సిబ్బంది, పోలీస్, రెవిన్యూ, నగర పాలక సంస్థ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. భక్తులకు మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్స్, మజ్జిగ ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం అందజేశారు. 10 నుంచి అన్న ప్రసాదం ఏర్పాటు కొనసాగుతోంది. ఒక్కో భక్తుడికి రెండు లడ్డూ బాక్స్‌లు చొప్పున ప్రసాదం అందుబాటులో ఉంచారు.



# పోరుబాట ఉధృతం.. 9న నర్సీపట్నంకు సీఎం జగన్

అమరావతి, అక్టోబర్ 05 : రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేయబోతున్న మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం ప్రభుత్వం పీపీపీ విధానాన్ని తీసుకొస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ విధానాన్ని వైసీపీ వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు సీఎం చంద్రబాబు కుట్ర చేస్తున్నారని ఆరోపిస్తోంది. అంతేకాదు మెడికల్ కాలేజీలను కాపాడలంటూ నిరసన కార్యక్రమాలకు సిద్ధమైంది. ఇప్పటికే పలు జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించారు. ప్రైవేటు పరం చేసే బదులు నిధులు కేటాయిస్తే మెడికల్ కాలేజీల నిర్మాణాలు పూర్తి అవుతాయని వ్యాఖ్యానించారు. అయితే మెడికల్ కాలేజీల కోసం పోరుబాట కార్యక్రమానికి తాజాగా పిలుపునిచ్చారు.



ఇందులో భాగంగా వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 9న నర్సీపట్నం వెళ్లనున్నారు. అక్కడి నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని పరిశీలించనున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అధికారికంగా ప్రకటించారు. మండలిలో మెడికల్ కాలేజీలపై చర్చించాలని పట్టుబట్టామని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని, సంక్షేమం, అభివృద్ధే తమ పార్టీ అజెండా అని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తెలిపారు.

## ప్రభుత్వంతో చర్చలు విఫలం..
# రిలే దీక్షలు కొనసాగిస్తామన్న పీహెచ్‌సీ వైద్యులు

అమరావతి: పీహెచ్‌సీ వైద్యులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. వైద్యుల డిమాండ్‌కు ప్రభుత్వం పూర్తిస్థాయి అంగీకారం తెలపకపోవటంతో.. వైద్యులు రిలే దీక్షలు కొనసాగిస్తున్నామని తెలిపారు. విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్‌తో పీహెచ్‌సీ వైద్యులు రెండు దఫాలుగా చర్చలు జరిపారు. పీజీ ఇన్ సర్వీస్ 20 శాతం కోటాను అన్ని విభాగాల్లో ఏడాది పాటు కొనసాగించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఆరోగ్య శాఖ కమిషనర్ అన్నారు. అయితే పీహెచ్‌సీ వైద్యులు ఐదేళ్లు అమలు చేయాలని డిమాండ్ చేశారని తెలిపారు. వారి పదోన్నతులను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చామన్నారు. సుమారు వెయ్యి మంది వైద్యులు ఈ కోటాలో పీజీకి వెళ్లారని తెలిపారు.



ఏటా వీరి సంఖ్య పెరిగితే వారికి ఉద్యోగాలివ్వటం కష్టసాధ్యమవుతుందన్నారు. ఖాళీ పోస్టుల ఆధారంగా కోటాను నిర్ణయించాలని.. దీని ప్రకారం ఎప్పటికప్పుడు కోటా శాతం మారాల్సిన అవసరం ఉంటుందన్నారు. వైద్యుల అన్ని డిమాండ్లకు అంగీకారం తెలుపుతున్నా.. వాళ్లు మొండి పట్టు పట్టడం సరికాదన్నారు. కొందరు వైద్యులు తమకు లబ్ధి చేకూరట్లేదనే అభిప్రాయంతో ఒప్పుకోవట్లేదన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని కమిషనర్ కోరారు. మరోవైపు తమ డిమాండ్లను పూర్తి స్థాయిలో ప్రభుత్వం అంగీకరించనందున తాము రిలే దీక్షలు కొనసాగిస్తామని పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులు డా.రవీంద్ర నాయక్ తెలిపారు.

# ‘బోయింగ్’లో ఎలక్ట్రికల్ వ్యవస్థలను తనిఖీ చేయండి: పైలట్ల అసోసియేషన్

బ్రిటన్‌లో ల్యాండింగ్ సమయంలో ఓ ఎయిరిండియా విమానం కీలక వ్యవస్థలో చోటుచేసుకున్న ఊహించని పరిణామం తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. ఈ క్రమంలో భారత పైలట్ల సమాఖ్య కీలక విజ్ఞప్తి చేసింది. బోయింగ్ 787 విమానాల్లో ఎలక్ట్రికల్ వ్యవస్థలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కోరుతూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు లేఖ రాసింది. “ఎయిరిండియా 171 ప్రమాద ఘటన తర్వాత ఇదే విషయంపై పైలట్ల సమాఖ్య తరఫున పలుసార్లు విజ్ఞప్తి చేశాం. డీజీసీఏ మాత్రం ఫ్యుయల్ కంట్రోల్ స్విచ్‌లను మాత్రమే తనిఖీ చేసింది. బీ787 విమానానికి సంబంధించి అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిలో ఉండే ఎలక్ట్రిక్ వ్యవస్థలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పౌరవిమానయాన శాఖ, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోని కోరుతున్నాం” అని పైలట్ల ఫెడరేషన్ పేర్కొంది. అమృత్‌సర్ నుంచి బర్మింగ్‌హామ్ వెళ్లిన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 విమానం ల్యాండింగ్ వేళ.. ర్యామ్ ఎయిర్ టర్బైన్ పనిచేయడం ఆందోళనకు కారణమైంది. ఇంజిన్లు, విద్యుత్, హైడ్రాలిక్ వైఫల్యం వంటి ఎమర్జెన్సీల్లో బ్యాకప్‌గా ఉండే ఈ వ్యవస్థ హఠాత్తుగా తెరుచుకోవడం కలకలం రేపింది. అయినప్పటికీ విమానం సురక్షితంగా దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే బోయింగ్ విమానాలపై భారత పైలట్ల సమాఖ్య ఆందోళన వ్యక్తం చేసింది.






## 12 రోజుల్లో 3600 కి.మీ..
## పదహారేళ్ల కుర్రాడు సైకిల్ యాత్రకు సై

అమరావతి: మహారాష్ట్రలోని అమరావతికి చెందిన శ్రీజల్ అనే పదహారేళ్ల కుర్రాడు సాహసోపేత సైకిల్ యాత్రకు సిద్ధమయ్యాడు. కన్యాకుమారి నుంచి శ్రీనగర్‌కు.. దాదాపు 3600 కి.మీ దూరాన్ని 12 రోజుల్లో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. అమరావతిలో ఆదివారం బయలుదేరిన అతడికి కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానిక సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు వీడ్కోలు పలికారు. 12వ తరగతి చదువుతున్న శ్రీజల్‌కు చిన్నప్పటి నుంచే సైక్లింగ్ అంటే ఇష్టం. అండర్ 17 విభాగంలో అక్టోబర్ 6న కన్యాకుమారి బీచ్ నుంచి శ్రీజల్ సైనిల్ తన యాత్రను మొదలు పెట్టనున్నాడు. వరల్డ్ ఆల్ట్రా సైక్లింగ్ అసోసియేషన్ (WUCA) మార్గదర్శకాలకు అనుగుణంగా సాగనుంది. గిన్నిస్ బుక్‌తో పాటు డబ్ల్యూయూసీఏ రికార్డులను సొంతం చేసుకోవాలన్న ధీమాతో ఉన్నాడు ఈ అమరావతి కుర్రాడు. ఉత్తరం నుంచి దక్షిణానికి ఎంతో మంది సైక్లింగ్ చేసినప్పటికీ.. తాను మాత్రం రివర్స్ రూటును ఎంచుకున్నానని చెప్పాడు. సొంతగా రికార్డు సృష్టించడమే కాకుండా తన పట్టణానికీ పేరు తేవాలన్నదే లక్ష్యమని చెబుతున్న శ్రీజల్‌కు స్థానికులు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు.

## మావోల కంచుకోట..
## బస్తర్ ప్రజలకు 10వేల రేడియో సెట్‌లు

మావోయిస్టు రహిత దేశంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రభావిత ప్రాంతాల్లో అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో మావోల ప్రభావం ఎక్కువగా ఉండే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రజల్లో మావోయిస్టు భావజాలాన్ని తొలగించి.. వారికి చేరువయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వారిలో జాతీయ భావనను పెంచేందుకు గాను భద్రతా దళాలు రేడియో సెట్‌లను అందించే కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగంగా నాలుగు నెలల్లో దాదాపు 10వేలకు పైగా రేడియో సెట్‌లను అక్కడి స్థానికులకు పంపిణీ చేశాయి. మావోయిస్టుల నిర్మూలనకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర హోంశాఖ.. బస్తర్ ప్రాంతంలోని ఏడు జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా అనేక ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ సాయంతో వందలాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. తాజాగా రేడియో సెట్‌లను పంపిణీ చేసి..ప్రధాని మోదీ ప్రతినెల సామాన్యులతో సంభాషించే



మన్‌కీబాత్‌తోపాటు వివిధ ప్రభుత్వ పథకాలు, వినోద కార్యక్రమాలను వినేలా ఏర్పాట్లు చేసింది. మొత్తంగా అక్కడ మోహరించిన 180 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలకు 60 రేడియోల చొప్పున కేటాయించగా.. వాటిని మారుమూల ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 54వేల మందిని ప్రధాన స్రవంతికి చేరువ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో రేడియో సెట్ ఖరీదు రూ.1500గా అంచనా. బ్యాటరీలు లేదా కరెంటుతో పనిచేసేలా ఈ రేడియోలను రూపొందించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.




## విమానంలో కో పైలట్‌గా భాజపా ఎంపీ!

ఎప్పుడూ ప్రజా సేవలో బిజీగా ఉండే రాజకీయ నాయకులు అప్పుడప్పుడూ.. తమలో ఉన్న ప్రతిభకు కొంత సమయం కేటాయిస్తుంటారు. తాజాగా భాజపాకు చెందిన బిహార్ ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ కో పైలట్‌గా మారారు. రూడీని ప్రశంసిస్తూ కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పెట్టిన పోస్టు నెట్టింట వైరల్ అవుతుంది. అసలేం జరిగిందంటే.. పట్నా నుంచి దిల్లీకి వెళ్లే విమానంలో చౌహాన్ ప్రయాణించారు. ఈ క్రమంలో విమానంలో కో పైలట్‌గా ఉన్న రూడీని చూసి ఆయన ఆశ్చర్యపోయారు. దీనికి సంబంధించి చౌహాన్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ‘రాజీవ్ ఈ రోజు మీరు మా హృదయాలను గెలుచుకున్నారు. పట్నా నుంచి దిల్లీకి వెళ్లే ఈ ప్రయాణం నాకు మరవలేనిది. ఎందుకంటే ఈ విమానానికి నా ప్రియమైన స్నేహితుడు, ఛప్రా ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ కో పైలట్‌గా ఉన్నారు’ అని రాసుకొచ్చారు. దీనికి విమానంలో ఇద్దరూ కలిసి మాట్లాడుకుంటూ ఉన్న ఫొటోలతో పాటు రూడీని ప్రశంసిస్తూ చేతితో రాసిన లేఖను కూడా చౌహాన్ పంచుకున్నారు. అందులో రూడీపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఇలాంటి వ్యక్తులు చాలా అరుదని, బిజీ షెడ్యూల్‌లు ఉన్నప్పటికీ.. తమలో ఉన్న ప్రతిభ కోసం సమయం కేటాయిస్తారన్నారు. ఈ సందర్భంగా తన ప్రయాణాన్ని చిరస్మరణీయంగా మార్చినందుకు రూడీకి చౌహాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఇక, బిహార్ నుంచి నాలుగుసార్లు ఎంపీగా గెలిచిన రూడీ కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు.

## కోళ్లు.. గొర్రెల వివరాలు అడగవద్దని చెప్పా..కులగణనపై డీకే

కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన కులగణన పూర్తి కావడానికి ఇంకా మూడు రోజులే మిగిలి ఉండడంతో.. అధికారులు సర్వేను మరింత వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కులగణనకు వెళ్లే అధికారులకు ముందే తాను పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలను వారికి ఎన్ని కోళ్లు, గొర్రెలు, మేకలున్నాయి? ఎంత బంగారం ఉందనే వ్యక్తిగత ప్రశ్నలు, వివరాలు అడగవద్దని సూచించానన్నారు. సర్వే చేస్తున్న సమయంలో ప్రజలు పంచుకోలేని వ్యక్తిగత ప్రశ్నలు అడిగవద్దని చెప్పినట్లు తెలిపారు. కానీ సర్వే నిర్వహించే అధికారులు స్వతంత్ర కమిషన్‌కు చెందిన వారు కాబట్టి..ఆ సమయానికి వారు ఏమి చేస్తున్నారో తెలియదన్నారు. రూ.420



కోట్ల అంచనా వ్యయంతో నిర్వహిస్తున్న ఈ సర్వేలో 60 ప్రశ్నల ప్రశ్నాపత్రం ఉందని.. అందులో అడిగే అన్ని ప్రశ్నలకు ప్రజలు కచ్చితంగా సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం లేదని శివకుమార్ అన్నారు. సమాధానం చెప్పడం ఇష్టంలేకపోతే అధికారులు వారిని బలవంతం చేయకూడదని కోర్టు సైతం పేర్కొన్నట్లు తెలిపారు. సర్వేకు సంబంధించిన అభ్యంతరాలను, ఖర్చును ప్రస్తావిస్తూ, ఎవరు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా కులగణనను పూర్తి చేస్తామన్నారు. 2015లో కర్ణాటక వెనకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలోనే ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మరోసారి కులగణనను చేపట్టింది. సెప్టెంబరు 22న ప్రారంభమైన ఈ సర్వే అక్టోబర్ 7న ముగియనుంది.

## ఈవీఎంలో ఇక అభ్యర్థుల కలర్ ఫొటోలు ఈసీ

బిహార్‌లో నవంబర్ 22 లోగా అసెంబ్లీ ఎన్నికలను పూర్తి చేస్తామని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. తొలిసారిగా ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండు రోజుల పాటు పర్యటించి, సమీక్షించిన ఎన్నికల సంఘం.. వీటికి సంబంధించిన వివరాలను పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించింది. ఈ సందర్భంగా పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం చేసింది. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని ఈసీ తెలిపింది. ‘‘అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశాం. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండనుంది. ఇప్పటికే బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తిచేశాం. ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నాం. తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తు పట్టేందుకు వీలుంటుంది. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నాం’’ అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఎస్ఐఆర్ ద్వారా అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బిహార్ ఓటర్లు కూడా స్వాగతించారని చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు తెలిపేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు. 243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీకి గడువు 2025 నవంబర్ 22తో ముగియనుంది. ఆ గడువులోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన ఈసీ.. గడువులోగా పూర్తి చేస్తామని చెప్పింది. అయితే, ఒకటి, రెండు దశల్లోనే వీటిని పూర్తి చేయాలనే అభ్యర్థనలు వచ్చాయని, దీనిపై



త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. 2020లో మూడు విడతల్లో పోలింగ్ జరగ్గా.. అంతకుముందు (2015లో) ఐదు విడతల్లో పోలింగ్ జరిగింది. ఇదిలాఉంటే, రాష్ట్రంలో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ ఇటీవల వెల్లడించింది.

## ఆ హత్యలపై స్వతంత్ర విచారణ జరగాలి..
## లేదంటే జైల్లోనే ఉంటా: వాంగ్‌చుక్

లద్దాఖ్ కు రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ ఇటీవల లేహ్ ప్రాంతంలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి లద్దాఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్ ను పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా ఆయన జైలు నుంచి ఓ సందేశాన్ని పంపారు. ఘర్షణల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోవడంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని, లేదంటే తాను జైలులోనే ఉండిపోయేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. వాంగ్‌చుక్ ప్రస్తుతం జోధ్‌పుర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. సోదరుడు కాత్సేతాన్ దోర్జె లేతో పాటు న్యాయవాది ముస్తఫా హాజీలు ఆయన్ను కలిసిన సందర్భంగా ఈ సందేశాన్ని పంపారు. ‘నేను శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నాను. నా కోసం ప్రార్థిస్తున్న వారికి ధన్యవాదాలు. ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు



సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి. నలుగురు వ్యక్తుల హత్యలకు సంబంధించి స్వతంత్ర న్యాయ విచారణ జరగాలి. లేదంటే నేను జైలులోనే ఉండేందుకు సిద్ధంగా ఉన్నాను. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కోసం ప్రజలు, లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఏడీఏ) చేస్తున్న డిమాండ్‌లకు మద్దతిస్తున్నా’ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్నారు. అహింసా మార్గంలోనే మన పోరాటాన్ని శాంతియుతంగా కొనసాగించాలని ప్రజలకు సూచించారు. లేహ్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక అల్లర్లలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. 90 మందికి పైగా గాయపడ్డారు. ఉద్యమకారులు సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే ఈ ఆందోళనలు జరిగాయని కేంద్రం వెల్లడించింది. అనంతరం పోలీసులు ఆయనను జాతీయ భద్రత చట్టం కింద అరెస్టు చేశారు. ఇలా అరెస్టయిన వ్యక్తిని విచారణ చేయకుండా 12 నెలల పాటు నిర్బంధించేందుకు చట్టం అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే తన భర్తను విడుదల చేయాలంటూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జే ఆంగ్మో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరగనుంది.

## కరూర్ తొక్కిసలాట.. పక్కా ప్రణాళికతో చేసిందే: ఖుష్బూ కీలక వ్యాఖ్యలు

టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై నటి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా ప్రణాళికతో, కావాలని చేసినట్లు కన్పిస్తోందని ఆరోపిస్తూ.. తమిళనాడు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తొక్కిసలాట ఘటనలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందని ఖుష్బూ పేర్కొన్నారు. ఇది ఎవరో కావాలని సృష్టించినట్లు ఉందన్నారు. విజయ్ ర్యాలీకి రాష్ట్ర ప్రభుత్వం సరైన స్థలం ఇవ్వలేదని విమర్శించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయారని.. మౌనంగా ఉన్న సీఎం స్టాలిన్ దీనిపై మాట్లాడాలన్నారు. ర్యాలీలో పోలీసులు లాఠీ ఛార్జ్ ఎందుకు చేశారని ఆమె ప్రశ్నించారు. దీనికి సంబంధించిన చాలా వీడియోలు బయటకు వచ్చాయన్నారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనలో 41 మంది



ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి టీవీకేకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు.. ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించే వరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది.

## వాట్సాప్ యూజర్లకు గుడ్‌న్యూస్.. త్వరలో అందుబాటులోకి డయలర్ హబ్ ఫీచర్..!




**న్యూఢిల్లీ:** ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్ వాట్సాప్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది మెటా కంపెనీ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వాట్సాప్‌కు 3.5 బిలియన్లకుపైగా యూజర్లు ఉన్నారు. మేసేజింగ్, ఫొటోలు, వీడియోలు, వాయిస్ కాల్స్, వీడియో కాల్స్, మనీ ట్రాన్స్‌ఫర్ ఫీచర్స్ ఉన్నాయి. అదే సమయంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫీచర్స్‌ను తీసుకువస్తూ యూజర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. తాజాగా మరో ఫీచర్‌ను తీసుకురాబోతున్నది. ఈ డయలర్ హబ్ ఫీచర్ సాయంతో కాంటాక్ట్ నంబర్ సేవ్ చేసుకునే వీలు కల్పిస్తున్నది. అలాగే ప్రత్యేకంగా చాట్ విండోను సైతం ఓపెన్ చేయాల్సి అవసరం ఉండదు. చాలామంది తమ పనులపై ఎవరికైనా వాట్సాప్ కాల్ చేయాలనుకున్నప్పుడు ప్రస్తుతం నంబర్ సేవ్ చేసుకొని మాట్లాడుతుంటారు.

కొత్త వ్యక్తులకు ఎక్కువ ఫోన్లు చేయాల్సిన వచ్చిన సమయంలో ప్రతిసారీ కాంటాక్ట్ నంబర్‌ను సేవ్ చేయాల్సిన ఇబ్బంది ఉంది. అదే సమయంలో మొబైల్ కాంటాక్ట్ లిస్ట్ భారీగా పెరుగుతుంది. వాట్సాప్ తీసుకువస్తున్న కొత్త అప్‌డేట్‌తో మీరు ఇకపై ఎవరికైనా కాల్ చేయడానికి చాట్‌ను ఓపెన్ చేయాల్సిన అవసరం గానీ.. నంబర్‌ను సేవ్ చేయాల్సిన పని ఉండదు. ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్ల కోసం కొత్త కాల్ హబ్ అన్ని కాలింగ్ ఫీచర్స్‌ను ఒకే చోటుకు తీసుకువస్తున్నది వాట్సాప్. యూజర్లు ఇకపై వేర్వేరు స్క్రీన్‌లకు నావిగేట్ చేయకుండా కాల్స్‌ను చేయొచ్చు. కాల్ షెడ్యూల్ పెట్టొచ్చు. డయలర్‌ను ఉపయోగించవచ్చు. కొత్త కాల్స్ ట్యాబ్ ఇప్పుడు ఏకీకృత ఇంటర్‌ఫేస్‌ను కలిగి ఉంది. ఇక్కడి నుంచే యూజర్లు నేరుగా కాల్ చేసుకోవచ్చు. కాల్స్‌ను కాల్‌లను షెడ్యూల్ చేయడంతో పాటు డయలర్ నుంచి నంబర్‌కి డయల్ చేయొచ్చు. ఈ మార్పు కాలింగ్‌ను వేగంగా, సులభతరంగా ఉండనున్నది. యూజర్లు మొదట కాల్స్ బటన్‌పై క్లిక్ చేయాల్సి. ఆ తర్వాత కుడివైపున పైన పస్ల్ గుర్తు కనిపిస్తుంది. ఇందులో న్యూ కాల్ లింక్, కాల్ ఏ నంబర్, న్యూ కాంటాక్ట్, షెడ్యూల్ కాల్స్ ఆప్షన్ కనిపిస్తాయి. ఇందులో ఇందులో కాల్ ఏ నంబర్‌పై క్లిక్ చేస్తే డయలర్ ఓపెన్ అవుతుంది. ఏ నంబర్‌కు అయితే ఫోన్ చేయాలనుకున్నారో ఆ నంబర్ నెంబర్‌ను ఎంటర్ చేసి కాల్ చేయవచ్చు. కాల్‌ను సైతం షెడ్యూల్ చేసుకునే వీలుంటుంది. కొత్త షెడ్యూలింగ్ ఫీచర్ ముందుగానే కాల్‌లను ప్లాన్ చేసుకోవడానికి, చాట్ ద్వారా వివరాలను పంచుకోవడానికి అనుమతి ఉంటుంది. ఇక బిజెనెస్ అకౌంట్స్ ఇప్పుడు వెరిఫికేషన్ బ్యాడ్జ్ అందుకుంటాయి. ఖాతా నిజమైనదా? కదా? అని యూజర్లు సులభంగా గుర్తించేందుకు వీలుంటుంది. ఈ ఫీచర్ మోసాల బారినపడకుండా కాపాడుతుంది. కొత్త కాల్ హబ్ ఫీచర్ కాలింగ్‌ను సులభతరం చేస్తుంది.

## మరో రెండు వారాల్లో గ్రోకీపీడియా : మస్క్




**న్యూఢిల్లీ:** టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మరో సంచలనానికి తెరతీశారు. నాలెడ్జి ప్లాట్‌ఫామ్ వికీపీడియా తరహాలోనే కొత్త దానిని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ పోస్టులో వెల్లడించారు. దానికి గ్రోకీపీడియాగా పేర్కొన్నారు. దీని 0.1 బీటా వెర్షన్ మరో రెండు వారాల్లో అందుబాటులో ఉంటుందని చెప్పారు.

గ్రోకీపీడియాను మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ కంపెనీ ఎక్స్‌ఏఐ సిద్ధం చేస్తోంది. ఎక్స్‌యూజర్ "మనుషులకు, కృత్రిమ మేధకు ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన నాలెడ్జ్ సోర్స్. దీనికి హద్దులు లేవు" అంటూ చేసిన పోస్టును మస్క్ రీపోస్టు చేశారు.

### డేటా సెంటర్లకు ఏఐ కళ

గ్రోకీపీడియాకు సంబంధించిన ఫీచర్లను మస్క్ ఇప్పటి వరకు అధికారికంగా వెల్లడించలేదు. వాస్తవాలను వెల్లడించడం కోసమే మస్క్ ఈ ప్లాట్‌ఫామ్‌ను తయారు చేస్తున్నారు. ఇక సెప్టెంబర్ నెలలో కూడా మస్క్ గ్రోకీపీడియా ప్రస్తావన తీసుకొచ్చారు. తాజాగా దాని బీటా వెర్షన్ డేట్‌ను విడుదల వివరాలు వెల్లడించడం విశేషం. దీనిని ఎక్స్ యాప్‌తోనే అనుసంధానించి ఇచ్చే అవకాశం ఉంది.

## 2,000 అడుగుల ఎత్తులో ఎయిర్‌ట్యాక్సీలు

### విదేశీ సాంకేతికత వినియోగం!



**న్యూఢిల్లీ:** నగరాల్లో ట్రాఫిక్ ఇబ్బందుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. మెట్రో, సబర్బన్ రైళ్లలో మినహా.. సొంత కారున్నా, 10 కిలోమీటర్లు వెళ్లేందుకే ఒకటి-రెండు గంటల పాటు ప్రయాణించాల్సిన స్థితి దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో నెలకొంది. ఏటా వేలకొద్దీ కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తుండటం ట్రాఫిక్ పరిస్థితిని మరింత జఠిలం చేస్తోంది. ఈ క్రమంలోనే అందరి దృష్టి ఎయిర్ ట్యాక్సీలపై పడుతోంది. ప్రస్తుతం సరకు రవాణాకు ఉపయోగపడుతున్న డ్రోన్ల కంటే పెద్ద పరిమాణంలో ఉండి, ఆకాశ మార్గంలో ఇద్దరి నుంచి ఆరుగురిని స్వల్ప దూరాలు తీసుకెళ్లగల ఎయిర్ ట్యాక్సీలపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. దేశీయ అగ్రగామి విమానయాన సంస్థ ఇండిగో, ప్రైవేటు జెట్‌లను నిర్వహించే జెట్‌సెట్ గో వంటి సంస్థలన్నీ దేశీయంగా ఈ సర్వీసుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించాయి. ముంబయికి చెందిన చలో మొబిలిటీ ప్రైవేటు లిమిటెడ్ కూడా ఎయిర్ ట్యాక్సీలను ప్రవేశ పెట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రియా సింగ్ 'ఈటీవీ భారత్'కు తెలిపారు.

### రోడ్డుపై గంట.. ఆకాశంలో 10 నిమిషాలు

నేలపై, కొంచెం ఎత్తైన ప్రదేశాల నుంచి గాల్లోకి నిటారుగా పైకి లేచే చిన్నపాటి హెలికాప్టర్ల వంటి ఎయిర్‌ట్యాక్సీల కోసం ప్రత్యేకంగా రన్‌వేలు అవసరం లేదని ప్రియా చెప్పారు. క్యాబ్‌ల తరహాలోనే.. అంటే గిరాకీ ఉన్నప్పుడే ప్రయాణిస్తాయి కనుక, అనవసరంగా నిర్వహణ వ్యయాలు ఉండవు. రోడ్లపై గంట సేపు ప్రయాణించే దూరాన్ని వీటిల్లో 10 నిమిషాల్లో చేరే వీలుంటుంది. విద్యుత్తుతో నడిపించేందుకే చూస్తున్నారు కనుక, కాలుష్య ఉద్గారాలు వెలువడతాయనే మాటే ఉండదు. వీటికోసం విదేశీ సాంకేతికతను వినియోగిస్తున్నారు.

### పైలట్ రహితంగా కూడా

తొలుత వీటిని పైలట్ల సాయంతోనే నిర్వహించాలన్నది ప్రణాళిక. అనుభవం వచ్చాక, పైలట్ లేకుండా సాంకేతికత సాయంతోనే నడపాలని యోచిస్తున్నారు. ఆకాశ హర్మ్యాలు అధికమవుతున్న దశలో, దాదాపు 2000 అడుగుల ఎత్తులో ప్రయాణించే ఎయిర్‌ట్యాక్సీలు ప్రమాదాలకు గురికాకుండా, తగిన నియమావళిని రూపొందించడంలో పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) నిమగ్నమైందని ప్రియ చెప్పారు. దుబాయి, అబుధాబి వచ్చే ఏడాదే ఎయిర్‌ట్యాక్సీలను నడిపేందుకు సిద్ధమవుతున్నాయి.

# ఆల్ రౌండ్ షోతో పాకిస్థాన్‌ను మట్టికరిపించిన భారత్

**మహిళల వరల్డ్ కప్:**

**మహిళల ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం**

**88 పరుగుల భారీ తేడాతో గెలుపొందిన టీమిండియా**

**భారత్ తరపున హర్లీన్ డియోల్ టాప్ స్కోరర్**

**మూడేసి వికెట్లతో చెలరేగిన క్రాంతి గౌడ్, దీప్తి శర్మ**

**పాక్ బ్యాటర్ సిద్రా అమీన్ ఒంటరి పోరాటం వృథా**




**కొలంబో:** అది పురుషుల క్రికెట్ అయినా, మహిళల క్రికెట్ అయినా... వరల్డ్ కప్ చరిత్రలో పాకిస్జాన్ చేతిలో ఇప్పటివరకు భారత్ ఓడింది లేదు. ఇప్పుడు కూడా అదే ఆనవాయతీ కొనసాగింది. ఐసీసీ మహిళల ప్రపంచకప్ 2025లో భాగంగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియం వేదికగా జరిగిన ఈ పోరులో టీమిండియా 88 పరుగుల భారీ తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. 248 పరుగుల లక్ష్యఛేదనలో పాక్ చేతులెత్తేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు స్మృతి మంధాన (23), ప్రతిక రావల్ (31) శుభారంభం అందించారు. ఆ తర్వాత హర్లీన్ డియోల్ (46) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. జెమీమా రోడ్రిగ్స్ (32), దీప్తి శర్మ (25) కూడా రాణించారు. అయితే, చివర్లో వికెట్ కీపర్ రిచా ఘోష్ కేవలం 20 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 పరుగులు చేసి అజేయంగా నిలవడంతో భారత స్కోరు 247 పరుగులకు చేరింది. పాక్ బౌలర్లలో డయానా బేగ్ 4 వికెట్లు పడగొట్టింది. అనంతరం 248 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్‌ను భారత బౌలర్లు కట్టుదిట్టంగా కట్టడి చేశారు. పాక్ బ్యాటర్లలో సిద్రా అమీన్ (81) ఒంటరి పోరాటం చేసినా, ఇతర బ్యాటర్ల నుంచి ఆమెకు ఏమాత్రం సహకారం అందలేదు. నటాలియా పర్వైజ్ (33) మినహా మిగతా వారంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్, దీప్తి శర్మ చెరో 3 వికెట్లు తీసి పాక్ పతనాన్ని శాసించారు. స్నేహ్ రాణాకు 2 వికెట్లు దక్కాయి. దీంతో పాకిస్థాన్ జట్టు 43 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ విజయంతో ప్రపంచకప్‌లో భారత్ తన ప్రస్థానాన్ని ఘనంగా కొనసాగిస్తోంది.




### ఆసియా కప్ ఫైనల్ వివాదంపై

## స్పందించిన ఏబీ డివిలియన్స్..

**మండిపడుతున్న ఫ్యాన్స్..!**



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ ఫైనల్ వివాదం ఇంకా కొనసాగుతుతూనే ఉన్నది. ఈ వివాదంలోకి దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం ఏబీ డివిలియర్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. దాంతో అభిమానులు మాజీ క్రికెటర్‌పై మండిపడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేస్తున్నారు. ఐపీఎల్‌లో డబ్బులు సంపాదించేందుకు భారత్ వస్తాడని.. భారతీయుల గురించి అతనికేం తెలుస్తుందంటూ మండిపడ్డారు. ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్తాన్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించి భారత టైటిల్‌ను గెలిచిన విషయం తెలిసిందే. అయితే, ఏసీసీ చైర్మన్‌గా ఉన్న నక్వీ నుంచి ట్రోఫీని తీసుకునేది లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ముందస్తుగా సమాచారం అందించినా నక్వీ సిగ్గులేకుండా ట్రోఫీని అందించేందుకు వేదికపైకి చేరుకోగా.. భారత ఆటగాళ్లు స్టేజ్‌పైకి వెళ్లేందుకు నిరాకరించారు. ఆ తర్వాత ఆసియా కప్ ట్రోఫీని తీసుకొని వెళ్లిపోయారు.

అయితే, ఈ వివాదంపై దక్షిణాఫ్రికా మాజీ స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడాడు. టీమిండియా వైఖరి తనకు నచ్చలేదని పేర్కొన్నారు. అక్కడున్న వ్యక్తి నుంచి ట్రోఫీ తీసుకోవాలనుకోలేదని.. క్రీడల్లో అలాంటి భాగం కాకూడదని అనుకుంటున్నానని.. రాజకీయాలకు క్రీడలను దూరంగా ఉంచాలని.. ఆటను ఆటగా మాత్రమే చూడాలని.. అది చూసేందుకు బాధగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరుగకుండా సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నానని.. ఇది ఆటగాళ్లను అసౌకర్య స్థితిలో ఉంచుతుందని.. అతడి తనది ఎక్కువగా బాధపెడుతుందని పేర్కొన్నాడు. చివరికి ఏర్పడిన వాతావరణం చాలా వింతగా ఉందని డివిలియర్స్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఎక్స్ వేదికగా మాజీ దక్షిణాఫ్రికా ఆటగాడిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డివిలియర్స్ కేవలం డబ్బు సంపాదన కోసం మాత్రమే భారత్‌కు వస్తాడని.. ఈ విషయంలో మద్దతు ప్రకటించడంలో ఇబ్బందిపడ్డాడని పేర్కొన్నారు.

### రెస్ట్ ఆఫ్ ఇండియాకు షాక్..

## విదర్భదే ఇరానీ కప్



**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ ఛాంపియన్ విదర్భ తమ జోరును చూపిస్తూ ఇరానీ కప్‌నూ పట్టేసింది. బ్యాటర్లతో పాటు స్పిన్నర్ దూబే చెలరేగడంతో రెస్ట్ ఆఫ్ ఇండియాకు షాకిస్తూ మూడోసారి ట్రోఫీని అందుకుంది. 2018, 2019లో ఇరానీ కప్ విజేత అయిన విదర్భ ఈసారి కూడా ఛాంపియన్‌గా నిలిచింది. దూబే నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థిని కూల్చడంతో 93 పరుగుల తేడాతో గెలుపొందింది. శతకంతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన అథర్వ తైడే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

విదర్భ నిర్దేశించిన 361 పరుగుల ఛేదనలో రెస్ట్ ఆఫ్ ఇండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. 35/2తో ఐదో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు ఐదో ఓవర్లోనే కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ కోల్పోయింది. రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్‌లు సైతం త్వరగా వెనుదిరగడంతో 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది రెస్ట్ ఆఫ్ ఇండియా. అనంతరం యశ్ ధుల్(92), సరాన్ష్ జైన్(29)లు ఆరో వికెట్‌కు 53 పరుగులు జోడించింది ఆదుకున్నారు. కానీ, జైన్ ఎల్బీగా ఔట్ కావడంతో 156/6తో లంచ్‌కు వెళ్లింది రెస్ట్ ఆఫ్ ఆండియా. ఆ తర్వాత మానవ్ సుతార్ (56), ధుల్ ద్వయం 103 పరుగుల భాగస్వామ్యలో విదర్భను భయపెట్టారు. కానీ, సెంచరీకి చేరువైన ధుల్‌ను, అన్షుల్ కంబోజ్‌ను యశ్ ఠాకూర్ ఔట్ చేయడంతో ఆ జట్టు ఆశలు ఆవిరయ్యాయి. టీ బ్రేక్ లోపే రెస్ట్ ఆఫ్ ఇండియాను 267కు ఆలౌట్ చేసిన విదర్భ హ్యాట్రిక్ ట్రోఫీతో చరిత్ర సృష్టించింది.

నాగ్‌పూర్‌లోని వీసీఏ స్టేడియంలో విదర్భ బౌలర్ల ధాటికి రెస్ట్ ఆఫ్ ఇండియా కుప్పకూలింది. తొలి వికెట్‌కు 52 పరుగుల శుభారంభం లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. కెప్టెన్ రజత్ పాటిదార్(66), అభిమన్యు ఈశ్వరన్(52)లు రాణించగా.. యశ్ ఠాకూర్ విజృంభణతో ఆ జట్టు214కే ఆలౌట్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో అథర్వ తైడే(143) మారథాన్ ఆటతో ఆదుకోగా.. యశ్ రాథోడ్(91) మెరవగా విదర్భ 312 రన్స్ చేసింది. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో ఆకాశ్ దీప్ (3-51), సరన్ష్ జైన్(2-94)లు రాణించారు.

# భావితరాలకు భరోసానిస్తూ..

**భారత క్రికెట్‌పై ముద్ర వేస్తున్న అగార్కర్..!**




**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌లో ఎందరో చీఫ్ సెలెక్టర్లను చూశాం. కానీ, సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన వాళ్లు మాత్రం కొందరే. ప్రస్తుతం ప్రధాన సెలెక్టర్ పదవిలో ఉన్న అజిత్ అగార్కర్ కచ్చితంగా రెండో కోవకే చెందుతాడు. ప్రతిసారి స్క్వాడ్ ఎంపికలో తనదైన ముద్ర వేస్తున్నాడీ మాజీ పేసర్. ఇంగ్లండ్ పర్యటనకు స్క్వాడ్ ఎంపిక నుంచి ఆసియా కప్ ఇప్పుడు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ వరకూ అతడు తనదైన పంథాను కొనసాగిస్తున్నాడు. సీనియర్లకు చెక్ పెడుతూ భావితరాలకు భరోసానిచ్చేలా స్క్వాడ్ ఎంపిక ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు.

దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని చెప్పకనే చెబుతున్నాడు అగార్కర్. అందుకే.. తన నిర్ణయాలను కొంతమంది విమర్శించినా.. టీమిండియా ప్రయోజనాలే తనకు ముఖ్యమని మొండిగా ముందుకు వెళ్తున్నాడు అతడు. మాజీ పేసర్ అయిన అగార్కర్ 2023 జూలై 4న చీఫ్ సెలెక్టర్ పదవి చేపట్టాడు. అప్పటి నుంచి అతడి ప్రతి నిర్ణయం సీనియర్లను ఆశ్చర్యపరిచేలా.. జూనియర్లకు అవకాశాలు కల్పించేలా ఉంటోంది. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ సలహాలు, సూచనల్ని పాటిస్తూనే.. జట్టుకు ఉపయోగపడే ఆటగాళ్లను మాత్రమే తీసుకుంటున్నాడు అగార్కర్.

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27ను దృష్టిలో పెట్టుకొని ఇంగ్లండ్ పర్యటనకు కొత్త కెప్టెన్ అవసరమని భావించిన అతడు.. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు సంకేతాలు ఇచ్చాడు. దాంతో.. వారిద్దరూ ఒకరివెంట ఒకరు సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. హిట్‌మ్యాన్, విరాట్ టెస్టులకు అల్విదా చెప్పడంలో చీఫ్ సెలెక్టర్, హెడ్‌కోచ్ పాత్ర ఉందనే విమర్శలు వచ్చినా అగార్కర్ వెనక్కి తగ్గలేదు. యువకుడైన శుభ్‌మన్ గిల్‌కు సారథ్యం అప్పగిస్తూ స్క్వాడ్‌ను ప్రకటించింది అతడి నేతృత్వంలోనే సెలెక్టర్లు. సీనియర్ల గైర్హాజరీలో గిల్ సమర్థంగా జట్టును నడిపించగా.. టీమిండియా సిరీస్‌ను సమం చేసింది. ఇక టీ20 ఫార్మాట్‌లో జరిగిన ఆసియా కప్ కోసం పొట్టి క్రికెట్ వీరులకే పట్టం కట్టాడు అగార్కర్. ఒకప్పటి సారథి హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, సంజూ శాంసన్‌లను తీసుకోవడమే కాదు.. గిల్‌ను ఓపెనర్‌గా ఎంపిక చేశాడు. అనంతరం.. వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు స్క్వాడ్ ఎంపికలోనూ తనమార్క్ చూపించాడు అగార్కర్. ఇంగ్లండ్ గడ్డపై విఫలమైన కరుణ్ నాయర్‌పై వేటు వేసి.. పునరాగమనం కోసం నిరీక్షిస్తున్న షమీని పక్కన పెట్టేశాడు. నాయర్ స్థానంలో కుర్రాడు దేవ్‌దత్ పడిక్కల్‌కు ఛాన్స్ ఇవ్వడంతో పాటు, సాయిసుదర్శన్‌కు మరోమారు కొనసాగించాడు. శనివారం ఆస్ట్రేలియా పర్యటనకు స్క్వాడ్‌ను ప్రకటించిన సెలెక్టర్లు రోహిత్ శర్మకు షాకిస్తూ గిల్‌ను వన్డే కెప్టెన్‌ను చేశారు.

### ప్రపంచకప్ లక్ష్యంగా..

రెండేళ్లలో వన్డే ప్రపంచకప్ ఉన్నందున రోహిత్‌ను కాదని.. గిల్‌కే పగ్గాలు అప్పగించింది అగార్కర్ బృందం. టెస్టుల్లో సమర్థుడైన నాయకుడిగా నిరూపించుకున్న గిల్.. వన్డేల్లోనూ టీమిండియాకు బెస్ట్ కెప్టెన్ అవుతడాని భావించడమే అందుకు కారణం. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న వరల్డ్ కప్ సన్నద్ధతకు గిల్‌కు సమయం కావాలి కాబట్టి.. ఆసీస్ సిరీస్‌తోనే అతడికి బాధ్యతలు ఇవ్వడం మంచిదని అతడు అనుకొని ఉంటాడు.

తనదైన ముందు చూపుతో అగార్కర్ నిర్ణయాలు తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు సీనియర్లను బాధించినా.. జట్టు ప్రయోజనాల రీత్యా అతడిని తప్పు పట్టలేని పరిస్థితి. అందుకే.. కొందరు విమర్శిస్తున్నా.. చాలామంది మాత్రం అతడి ముక్కుసూటితనాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. పొమ్మనలేక పొగబెట్టే ధోరణి కాకుండా.. తనకు ఏం కావాలి? జట్టుకు ఏది మంచిది? అనే విషయంలో అగార్కర్‌కు ఉన్న స్పష్టత భారత క్రికెట్‌లో కొత్త ఒరవడికి నాంది పలికిందనే చెప్పాలి.

## తేజ సజ్జా టీంతో దిల్ రాజు సక్సెస్
# సెలబ్రేషన్స్..



**టాకీస్:** ఇటీవలే మిరాయి సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు హనుమాన్ ఫేం తేజ సజ్జా. ఈ మూవీ బాక్సాఫీస్‌పై దండయాత్ర చేస్తూ తెలుగుతోపాటు విడుదలైన అన్ని భాషల్లో సక్సెస్‌ఫుల్ టాక్ తెచ్చుకొని నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. సుమారు 60 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన మిరాయి పాన్ ఇండియా మార్కెట్‌లో బాక్సాఫీస్ వద్ద రూ.140 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. ఈ మూవీ టీం సక్సెస్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తోంది.

టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు మిరాయి టీంతో కలిసి సక్సెస్‌ను సెలబ్రేట్ చేసుకున్నారు. దిల్ రాజు నివాసంలో తేజ సజ్జా, డైరెక్టర్ అండ్ టీం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. టీం మెంబర్స్ అంతా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మిరాయిలో ఢిల్లీ భామ రితికా నాయక్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటించగా.. మంచు మనోజ్ కీ రోల్ పోషించాడు. ఈ మూవీకి సీక్వెల్ రానుండగా.. మిరాయి : జైత్రయా టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. సీక్వెల్ పార్టులో టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి కీలక పాత్రలో కనిపించబోతున్నాడని వార్తలు వస్తుండగా.. రానున్న రోజుల్లో క్లారిటీ వస్తుందో చూడాలి.

## నాగశౌర్య ‘బ్యాడ్ బాయ్ కార్తిక్’ టీజర్ వచ్చేది అప్పుడే.!



**టాకీస్:** యువ హీరో నాగశౌర్య ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. గతంలో ఆయన నటించిన పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పర్చడంతో ఎలాగైన హిట్ కొట్టాలానే కసితో ఉన్నాడు. ఈ క్రమంలోనే వరుస సినిమాలను ఓకే చేస్తున్నాడు. ఈ క్రమంలోనే కొత్త దర్శకుడు రామ్ దేశిన డైరెక్షన్‌లో నాగశౌర్య ‘బ్యాడ్ బాయ్ కార్తిక్’ అనే ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నాడు. శ్రీవైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే తాజాగా ఈ మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను పంచుకుంది చిత్రయూనిట్. ఈ సినిమా టీజర్‌ను రేపు ఉదయం 11.57 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.




# ఆ సినిమాకు నా హృదయంలో ప్రత్యేక స్థానం..
### తెలుగు మూవీపై కయాదు లోహర్

**టాకీస్:** డ్రాగన్ సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కయాదు లోహర్. ఈ అస్సామీ సుందరి నెట్టింట పోస్ట్ పెట్టిందంటే చాలు కామెంట్స్, లైకుల వర్షం కురుస్తుంది. ఈ బ్యూటీ తాజాగా చెన్నైలో జరిగిన ఓ అవార్డ్స్ ఈవెంట్ సెర్మనీలో పాల్గొంది. ఈ సందర్భంగా తనకు బాగా ఇష్టమైన, స్ఫూర్తిని కలిగించే సినిమా ఏంటో చెప్పింది కయాదు లోహర్. ఇంతకీ ఆ సినిమా ఏంటనుకుంటున్నారా..? బాక్సాఫీస్‌ను షేక్ చేసిన కల్ట్ క్లాసిక్ ఏ మాయ చేశావే. తాను ఏ మాయ చేశావే తెలుగు, తమిళ వెర్షన్లకు వీరాభిమానిని.. మనస్సును కదిలించే స్టోరీ టెల్లింగ్ చాలా మందికి ప్రేరణ కలిగించేలా ఈ రొమాంటిక్ డ్రామా సాగుతుందని చెప్పింది కయాదు లోహర్. ఈ చిత్రానికి తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుందని చెప్పుకొచ్చింది. ఈ సినిమాలో త్రిష, శింబు (తమిళ వెర్షన్)లో అద్భుతంగా ఉంటుందని.. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ ఆల్బమ్ ఆల్‌టైమ్ ఫేవరేట్ హిట్ లిస్టులో ఉంటుందని చెప్పుకొచ్చింది. కయాదు లోహర్ ప్రస్తుతం తమిళంలో మూడు, మలయాళంలో ఒక సినిమా చేస్తుంది.

# దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత
## మోహన్‌లాల్‌ను సన్మానించిన కేరళ ప్రభుత్వం

**టాకీస్:** భారతీయ సినిమా రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును గెలుచుకున్న మలయాళ దిగ్గజ నటుడు మోహన్‌లాల్‌ను కేరళ ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. మలయాళం వానోళం, లాల్ సలాం పేరుతో తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్య అతిథిగా హాజరై మోహన్‌లాల్‌ను సత్కరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ మోహన్‌లాల్‌ను ప్రతి మలయాళీకి గర్వకారణంగా అభివర్ణించారు. మలయాళ సినిమా కళాత్మకంగా, వాణిజ్యపరంగా ఎదగడంలో మోహన్‌లాల్ పాత్ర ఎంతో ఉందని ప్రశంసించారు. 2004లో లెజెండరీ ఫిల్మ్ మేకర్ అదూర్ గోపాలకృష్ణన్ తర్వాత, రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ కేరళకు ఈ అత్యున్నత గౌరవాన్ని మోహన్‌లాల్ తీసుకురావడం గొప్ప విషయమన్నారు.

సన్మానం అందుకున్న అనంతరం మోహన్‌లాల్ మాట్లాడుతూ.. ఢిల్లీలో అవార్డు అందుకోవడం కంటే తాను పుట్టి పెరిగిన స్వస్థలంలో, సొంత ప్రజలు ప్రభుత్వం నుంచి గౌరవం దక్కడం తనకు మరింత భావోద్వేగాన్ని కలిగించిందని తెలిపారు. ఈ గాలి, ఈ ప్రదేశాలు, ఈ జ్ఞాపకాలు నా ఆత్మలో భాగం. ఇలాంటి భావోద్వేగాలను నటించలేం” అని ఆయన పేర్కొన్నారు. ఈ అవార్డు మలయాళ చిత్ర పరిశ్రమకు, తనను ఆదరించిన ప్రేక్షకులందరికీ అంకితమని మోహన్‌లాల్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, ప్రముఖ సినీ, సాంస్కృతిక ప్రముఖులు, వేలాది



మంది అభిమానులు పాల్గొన్నారు. ఈ వేడుకలో మోహన్‌లాల్ నటించిన చిత్రాల పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. మోహన్‌లాల్ సెప్టెంబర్ 23, 2025న ఢిల్లీలో జరిగిన 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్నారు.

## తమిళ నటుడు సూరి, సుహాస్
# సినిమా షూటింగ్‌లో ప్రమాదం..
### సముద్రంలో పడవ బోల్తా..




**టాకీస్:** ప్రముఖ తమిళ నటుడు సూరి మరియు తెలుగు నటుడు సుహాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ‘మండాడి’ సినిమా షూటింగ్‌లో పెద్ద ప్రమాదం జరిగింది. తమిళనాడులోని రామనాథపురం జిల్లా, తొండి సముద్రతీర ప్రాంతంలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్న సమయంలో సాంకేతిక నిపుణులు ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పడవలో ఉన్న ఇద్దరు వ్యక్తులు నీట మునిగిపోయారు. అలాగే, సుమారు కోటి రూపాయల విలువైన కెమెరాలు, ఇతర సాంకేతిక సామాగ్రి పూర్తిగా ధ్వంసమై, నీటిలో మునిగిపోయాయి. దీంతో యూనిట్ సభ్యులు వెంటనే అప్రమత్తమై నీట మునిగిన ఇద్దరిని కాపాడటంతో ప్రాణనష్టం తప్పింది. నటులు సూరి, సుహాస్ ఈ సమయంలో పడవలో లేకపోవడం వల్ల సురక్షితంగా ఉన్నారు. జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ నిర్మాతగా, మాతిమారన్ పుగళేంధి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమా ద్విభాషా చిత్రంగా (తమిళం, తెలుగు) తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో సూరి హీరోగా నటిస్తుండగా.. సుహాస్ విలన్‌గా నటిస్తున్నాడు.

# జాక్వెలిన్ ఫెర్నాండేజ్ అందం చూడతరమా..?
### ఫ్యాషన్ వీక్‌లో మెరుపులు

**టాకీస్:** గ్లామరస్ రోల్స్‌తోపాటు నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ ఇండియావైడ్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్న భామల్లో ఒకరు జాక్వెలిన్ ఫెర్నాండేజ్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త లుక్స్‌లో కనిపిస్తూ సోషల్ మీడియాను షేక్ చేస్తుంటుంది.

లండన్ ఫ్యాషన్ వీక్ అనామిక ఖన్నా షోలో హొయలు పోతూ కెమెరాకు ఫోజులిచ్చిన జాక్వెలిన్ ఫెర్నాండేజ్ తాజాగా మరో ఈవెంట్‌లో తళుక్కున మెరిసింది. ఈసారి పారిస్ ప్యాషన్ వీక్ 2025లో బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో సందడి చేసింది. జాక్వెలిన్ ఫెర్నాండేజ్ వేలాడుతున్న హియర్ రింగ్స్‌తో చేతిలో హ్యాండ్ పర్స్ పట్టుకొని లైటింగ్స్ మధ్య హొయలు పోతూ కెమెరాలకు ఫోజులిచ్చింది.

కిక్, రేస్, రైడ్, వెల్‌కమ్, హౌస్‌ఫుల్ సినిమాలతో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న జాక్వెలిన్ త్వరలో తెలుగులో ఓ సినిమా చేసేందుకు రెడీ అవుతుందంటూ సోషల్ మీడియాలో ఓ వార్త హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ భామ టాలీవుడ్ డైరెక్టర్‌తో ఫీ మేల్ సెంట్రిక్ సబ్జెక్టుతో ఓ సినిమా చేసేందుకు రెడీ అయిందని తెలుస్తుండగా.. దీనిపై రానున్న రోజుల్లో ఏమైనా క్లారిటీ వస్తుందేమో చూడాలి.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.